
ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
31-12-2024
మంగళవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 110 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



# భారతరత్న ఇవ్వాలని సభలో తీర్మానం

## మన్మోహన్ సింగ్‌కు తెలంగాణ శాసనసభ సంతాపం

భారత దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు తెలంగాణ శాసనసభ సంతాపం తెలిపింది. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర శాసనసభ తీర్మానం చేశారు. కేంద్రానికి ఆ ప్రతిపాదనలు పంపనున్నారు. ఆర్థిక సంస్కరలతో దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించిన వ్యక్తి మన్మోహన్ అని కొనియాడారుపీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో కేంద్ర ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ దశ దిశను మార్చింది. మన్మోహన్ ఆనాడు తీసుకున్న నిర్ణయాలు నేటికి పాటిస్తున్నాం. నేడు దివంగత ప్రధానికి సంతాపం తెలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తోంది.



2 లో

# చలానాలు మా లక్ష్యం కాదు

- 9.87పెరిగిన క్రైమ్.. రికవరీలు అద్భుతం
- మత్తుమందు దొరకని రాష్ట్రంగా తెలంగాణ
- పక్కా వ్యూహంతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట
- సొత్తును వెనక్కు తేవడంలో రాష్ట్రం టాప్
- ఫోన్ ట్యాప్ కేసులో ఇంటర్‌పోల్ సాయం
- పిల్లల రక్షణకు హ్యాండ్ బుక్
- వార్షిక నివేదిక విడుదలలో డీజీపీ జితేందర్

**జయభేరి, హైదరాబాద్, డిసెంబరు 30:**

ట్రాఫిక్ చలాన్ల ద్వారా రూ. 100కోట్లు లేదా రూ.200 కోట్లను ప్రభుత్వానికి ఇవ్వడం తమ లక్ష్యం కాదని డీజీపీ స్పష్టం చేశారు. రహదారి భద్రత, ప్రయాణికుల ప్రాణాలను కాపాడడం తమ విధి అని వివరించారు. 2014కు ముందు 4 మంది వాహనదారులే హెల్మెట్ ధరించేవారని, ఇప్పుడు వారి శాతం 80కి పెరిగిందన్నారు. ...మిగతాది 2 లో



# జగన్‌మోహన్‌రెడ్డికు క్రెడిబులిటీ లేదు



- క్రెడిబిలిటీ లేని నాయకులు, హిడెన్ ఏజెండాతో మాట్లాడతారు
- జగన్ ఎప్పుడు ఏం చేస్తారనేది అతనికే తెలియదని ఎద్దేవా
- వాటర్ సెక్యూరిటీకి ఎంతో ప్రాధాన్యం ఇచ్చాం
- "ఎన్టీఆర్ నీళ్ల విషయంలో ఎంతో ముందు చూపుతో వ్యవహరించారు
- జలహారతి ప్రాజెక్టు ఏపీకి గేమ్ చేంజర్..
- గోదావరిలో 10శాతం మాత్రమే వినియోగం..
- సచివాలయంలో సాగునీటి ప్రాజెక్ట్‌లపై సీఎం చంద్రబాబు పవర్ ప్రజెంటేషన్

**జయభేరి, అమరావతి, డిసెంబర్ 30:**

సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికు క్రెడిబులిటీ లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. ఐదేళ్లలో ఏం జరిగింది...ఇప్పుడు ఏం జరిగింది అని ప్రజలు చూస్తున్నారన్నారు. జగన్ ఎప్పుడు ఏం చేస్తారనేది అతనికే తెలియదని ఎద్దేవా చేశారు. క్రెడిబిలిటీ లేని నాయకులు, హిడెన్ ఏజెండాతో మాట్లాడతారని సెటైర్లు గుప్పించారు. వాస్తవాలు లేకుండా జగన్ ...మిగతాది 2 లో



# నాగబాబు ఎమ్మెల్సీ తర్వాత మంత్రి పదవి

**జయభేరి, విజయవాడ, డిసెంబర్ 30:**

జనసేన నేత, సోదరుడు నాగబాబుకు మంత్రి పదవిపై ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. రాజకీయాల్లో పని తీరే ప్రామాణికమని, కలిసి పనిచేసిన వారిని గుర్తించాల్సిన బాధ్యత తనకు ఉందని అన్నారు. సోమవారం మంగళగిరిలో ఆయన మీడియా చిట్ చాట్ లో మాట్లాడారు. 'మాకు బ్యాక్‌గ్రౌండ్ లేకున్నా అన్నయ్య సొంతంగా ఎదిగారు. ఇప్పుడు మా తర్వాత తరం పిల్లలకు ఓ బ్యాక్‌గ్రౌండ్ ఉంది. మనతో ప్రయాణం చేసి, ...మిగతాది 2 లో

# సత్య నాదెళ్లతో రేవంత్ భేటీ



**జయభేరి, హైదరాబద్, డిసెంబర్ 30:**

తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల సాధనపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల గూగుల్ ప్రతినిధులు కూడా సీఎం ను కలిసి హైదరాబాద్ నగరంలో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఓ వైపు పాలన, మరోవైపు పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ముందడుగు వేస్తున్నారు. తాజాగా పెట్టుబడుల విషయంలో తెలంగాణ ...మిగతాది 2 లో



# పుష్ 2 మూవీ కలెక్షన్లలో రేవంత్‌కు 14 శాతం వాటా!?

- అనుమానం వ్యక్తం చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్

**జయభేరి, కరీంనగర్ డిసెంబర్ 30:**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై పరోక్షంగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు గొప్పో పవన్ కల్యాణ్‌కే తెలియాలని అన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు చేసినట్లుగా పవన్ కల్యాణ్ భావిస్తున్నారా అని ప్రశ్నించారు. ...మిగతాది 2 లో

# అల్లు అర్జున్ బెయిల్ పిటీషన్ వాయిదా



**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 30:**

టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా పడింది. నేడు అల్లు అర్జున్ రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ పై విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు, బెయిల్ పై పోలీసులు దాఖలు చేసిన కౌంటర్ ను పరిశీలించింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు జనవరి 3కు తీర్పు వాయిదా వేసింది. అల్లు అర్జున్ కు నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడిషీయల్ కస్టడీ విధించగా పోలీసులు ఆయనను చంచల్ గూడ జైలుకు తరలించారు. అదేరోజు హైకోర్టులో వేసిన పిటిషన్ విచారించిన హైకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిల్ ఇవ్వడం తెలిసిందే. దాంతో ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## చలానాలు మా లక్ష్యం కాదు

రోజూ 3,500 కొత్త వాహనాలు రోడ్డెక్కుతున్నాయని, వీటిల్లో ఒక్క హైదరాబాదులోనే 2 వేలకు పైగా ఉంటాయన్నారు. "తెలంగాణలో డ్రగ్స్ అమ్మాలన్నా.. కొనాలన్నా భయపడేలా.. పట్టుబడితే శిక్ష తప్పదనేలా చర్యలు తీసుకుంటున్నాం. డ్రగ్స్ రహితంగా.. మత్తుమందు దొరకని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నాం" అని డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. ఈ ఏడాది మొత్తం 1,942 డ్రగ్స్ కేసుల్లో 4,682 మందిని అరెస్టు చేశామని, రూ.142.95 కోట్ల విలువైన మత్తుపదార్థాలను సీజ్ చేశామని గుర్తుచేశారు. ఈ కేసుల్లో నిందితులకు చెందిన రూ.55.8 కోట్ల ఆస్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆదివారం ఆయన రాష్ట్ర వార్షిక నేర నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. మావోయిస్టుల కట్టడికి, సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. "సైబర్ నేరాల్లో డబ్బు పోగొట్టుకున్న వారికి రూ.180 కోట్ల మేర తిరిగి ఇప్పించాం. ఈ ఏడాది సైబర్ నేరాలకు సంబంధించి 25,184 ఫిర్యాదులు వచ్చాయి. గత ఏడాది (17,571 ఫిర్యాదులు)తో పోలిస్తే.. సైబర్ నేరాల్లో 25.18% పెరుగుదల ఉంది. సైబర్ నేరాల్లో రికవరీకీ సంబంధించి దేశంలోనే తెలంగాణ టాప్‌లో ఉంది" అని వ్యాఖ్యానించారు. మొత్తమ్మీద ఈ ఏడాది నేరాల్లో 9.87% పెరుగుదల ఉందన్నారు. "గత ఏడాది మొత్తం 2,13,121 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది వాటి సంఖ్య 2,34,158గా ఉంది. వీటిల్లో 1,55,639 కేసులను నవంబరు నెలాఖరులోగా పరిష్కరించాం. ప్రాసిక్యూషన్, పోలీసు శాఖ కలిసి పనిచేయడం వల్ల చాలా కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చేయడం సాధ్యమైంది. వీటిల్లో మూడు మరణ శిక్షలు, 215 జీవిత ఖైదు శిక్షలున్నాయి. శిక్షలు పడ్డ వారిలో 35 మంది రౌడీషీటర్లున్నారు" అని వివరించారు. మహిళలపై నేరాలు స్వల్పంగా పెరిగాయని డీజీపీ చెప్పారు. గత ఏడాది 19,013 కేసులు నమోదవ్వగా.. ఈ ఏడాది వాటి సంఖ్య 19,922కు పెరిగిందన్నారు. రాష్ట్రంలో మిస్సింగ్ కేసుల్లో 18% మేర తగ్గుదల నమోదైందని వివరించారు. "రాష్ట్రంలో పనిచేస్తున్న 27 భరోసా కేంద్రాలు గృహహింస, వరకట్న వేధింపులు, అత్యాచారం కేసుల్లో బాధితులకు అండగా ఉంటున్నాయి. ఈ ఏడాది షీటీమ్స్‌కు 10,862 ఫిర్యాదులు రాగా.. వాటిపై 830 కేసులు నమోదు చేశాం. మిగతా వాటిల్లో 3,329 పెటీ కేసులు. ఇతర కేసులను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించాం. భరోసా కేంద్రాలకు 2,964 ఫిర్యాదులు వచ్చాయి. వీటిల్లో 1,974 పోక్సో కేసులు కాగా.. 574 అత్యాచారాలు, 436 ఇతర వేధింపులకు సంబంధించిన కేసులున్నాయి" అని వెల్లడించారు. రేప్, పోక్సో కేసులకు సంబంధించి బాధితులకు ప్రభుత్వం రూ.5.42 కోట్ల మేర నష్టపరిహారం ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయని జితేందర్ తెలిపారు. "గత ఏడాది 23,491 రోడ్డు ప్రమాద కేసులు నమోదవ్వగా.. ఈ వాటి సంఖ్య 20,702కు తగ్గాయి. రోడ్డు ప్రమాదాల్లో మరణాలు కూడా 1.49% మేర తగ్గాయి. గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 6,640 మంది మరణించగా, ఈ ఏడాది 6,541 మంది మరణాలు నమోదయ్యాయి. అత్యంత ఘోరమైన ప్రమాదాలు 2,336 నుంచి 1,018కి తగ్గాయి" అని వివరించారు. రోడ్డు ప్రమాదాల బ్లాక్‌స్పాట్లను ఎప్పటికప్పుడు గుర్తించి, ఇంజనీరింగ్ నిపుణులతో చర్చించి, తగు చర్యలు తీసుకోవడం ప్రమాదాల్లో తగ్గుదల సాధ్యమైందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇంటర్‌పోల్ సాయం తీసుకుంటున్నట్లు డీజీపీ పేర్కొన్నారు. విదేశాల్లో తలదాచుకుంటున్న ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్‌లను రప్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. సంధ్య థియేటర్ ఘటనపై విచారణ కొనసాగుతోందని, కోర్టు పరిధిలోని అంశం కావడంతో దీనిపై మాట్లాడలేనని స్పష్టంచేశారు. బౌన్సర్లపై వచ్చిన ప్రతి ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని, తేడా వస్తే వదిలేది లేదన్నారు. మొట్టమొదటి డిజిటల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ), తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో(టీన్యాబ్)ను మరింత పటిష్ఠం చేస్తున్నాం. ప్రొవిజన్ మరియు లాజిస్టిక్ విభాగం ద్వారా పాత వాహనాలు, తుక్కు సామగ్రి అమ్మకం ద్వారా రూ.9.49 కోట్లను ప్రభుత్వానికి డిపాజిట్ చేశామన్నారు. రాష్ట్రంలో 53,651 సీసీ కెమెరాలు పోలీసు ఠాణాల్లో ఉన్నాయని.. 11,64,645 సీసీ కెమెరాలు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా అనుసంధానమై ఉన్నాయని చెప్పారు. సగం ఠాణాల్లో సీసీ కెమెరాలు లేవని 'ఆంధ్రజ్యోతి' అడిగి ప్రశ్నకు బదులిస్తూ.. దశల వారీగా అన్ని పోలీస్‌స్టేషన్లలో వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. పని ఒత్తిడి, వివిధ కారణాలతో పోలీసు సిబ్బంది ఆత్మహత్యలు నమోదయ్యాయని, వీటిని నివారించేందుకు ప్రతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఎప్పటికప్పుడు పోలీసు శాఖలో రిక్రూట్‌మెంట్లు జరుపుతున్నామని.. ఈ ఏడాది 13 వేల మంది కొత్త కానిస్టేబుళ్లు నియమితులయ్యారని డీజీపీ వివరించారు. వీరిలో 30% మహిళలేనని తెలిపారు. డయల్ 100, 112 సమర్థంగా పనిచేస్తున్నాయని, ఫిర్యాదు వచ్చిన 10 నిమిషాల్లో పోలీసులు సంఘటనాస్థలికి వెళ్తున్నారని వివరించారు. డిజిటల్ యుగంలో చిన్నారులు సైతం స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లను వాడుతున్నారు. ఇంటర్నెట్‌ను సర్ఫ్ చేయగలుగుతున్నారు. ఈ నేపథ్యంలో పిల్లల భద్రతకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) రూపొందించిన హ్యాండ్ బుక్‌ను డీజీపీ విడుదల చేశారు. స్మార్ట్‌ఫోన్లను పిల్లలు ఎంతసేపు వాడవచ్చు? ఏయే యాప్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి? పేరంటల్ కంట్రోల్ ఎలా? తదితర అంశాలపై సైబర్ సెక్యూరిటీ నిపుణులు అందజేసిన సూచనలను హ్యాండ్ బుక్‌లో పొందుపరిచినట్లు డీజీపీ వివరించారు.

## జగన్‌కు క్రెడిబులిటీ లేదు

మాట్లాడతారని మండిపడ్డారు. అబద్ధాలతో రాజకీయం చేశారని.. ఇప్పుడు అలా కాదని అన్నారు. రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఏపీ సచివాలయంలో సాగునీటి ప్రాజెక్ట్‌లపై సీఎం చంద్రబాబు పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మీడియా, ఫైనాన్స్, వ్యవస్థలు, వ్యక్తులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని చెప్పారు. వాటర్ సెక్యూరిటీకి ఎంతో ప్రాధాన్యం ఇచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తెలుగు గంగా ప్రాజెక్టు చేపట్టిన తర్వాత ఇందిరా గాంధీ సమక్షంలో అగ్రిమెంట్ జరిగిందని గుర్తుచేశారు. గండికోట, సోమశిల విస్తరణ, కండలేరు వంటి ప్రాజెక్టులు ముందుకు తీసుకువెళ్లామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 7 మండలాలు తెలంగాణలో ఉన్న వాటిని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి చెప్పి వాటిని ఏపీలో విలీనం చేశామని గుర్తుచేశారు. దీనికోసం రాష్ట్రపతితో సంతకం చేశాక పార్లమెంట్ సమావేశంలో బిల్లు పెట్టారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. "ఎన్టీఆర్ నీళ్ల విషయంలో ఎంతో ముందు చూపుతో వ్యవహరించారు. వెలుగొండను నేనే ప్రారంభించి పూర్తిచేశా. అనంతపురం తలసరి ఆదాయంలో ముందు వరుసకు వచ్చింది. రాయలసీమకు నీరు వస్తే డెల్టాతో పోటీపడుతుంది. కృష్ణానదిలో పై నుంచి నీరు రావడం లేదు, పట్టిసీమ వచ్చాక సరైన సమయంలో పంట వేయగలుగుతున్నాం. గోదావరి, కృష్ణాలో నీళ్లుతగ్గినా గోదావరిలో నీరు వస్తోంది. రాష్ట్రంలో కరవును సమర్థంగా ఎదుర్కొంటేనే తప్ప అభివృద్ధి సాధ్యం కాదు. 2 టీఎంసీల నీటిని బనకచర్లకు తీసుకువెళ్లేలా చర్యలు తీసుకుంటాం. ఓవరాల్‌గా చూస్తే 50 ఏళ్ల సరాసరిలో 3000 టీఎంసీలు గోదావరి నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి. ఈసారి నీళ్లు రిజర్వాయర్‌లకు పంపాం. ఈరోజు టోటల్ రిజర్వాయర్ కెపాసిటీతో ఉంది. సమర్థంగా నదులు అనుసంధానం చేసి రిజర్వాయర్‌లు కట్టుకుంటే నీటి సమస్య పరిష్కారమవుతుంది. ఏపీకి కరవు, తుఫాను వల్ల ఇబ్బందులు ఉన్నాయి. వంశధార నాగావళి గోదావరి కృష్ణ వరకూ కలిపే అవకాశం ఉంటుంది. తుంగభద్ర శ్రీశైలం నాగార్జునసాగర్ ప్రకాశం బ్యారేజి, చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ వస్తే నాగార్జున సాగర్ లెఫ్ట్ మెయిన్ కెనాల్ పూర్తి అవుతుంది" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

"తెలుగు తల్లికి జలహారతి ప్రాజెక్టు రూపకల్పన చేశాం. విజన్ 2047 డాక్యుమెంట్‌లో బాగంగా వాటర్ ప్రాజెక్టు ప్రొవిజన్ ఉంచాం. ఇది దాదాపు ప్రస్తుతానికి రూ.80.112 కోట్లు వ్యయం అవుతుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే రాష్ట్రానికి గేమ్ చేంజర్ లాంటిది. రాష్ట్రానికి సాగునీరు...తాగునీరు..రాయలసీమ ప్రాంతాలకు పరిశ్రమలకు నీరు అందుతుంది. పవర్ పాయింట్ ద్వారా ప్రాజెక్ట్ గురించి సీఎం చంద్రబాబు వివరించారు. బావి తరాల కోసం ఈ ప్రాజెక్ట్ రూప కల్పన చేశాం. 5 కోట్ల ప్రజలు కూడా ఈ ప్రాజెక్ట్ గురించి ఆలోచించాలి. బనకచర్ల రాయల సీమకు గేట్ వే అవుతుంది... అక్కడి నుంచి అన్ని ప్రాంతాలు కనెక్టు చేయొచ్చు. ప్రతి ఐదేళ్లకు 40 శాతం కాస్ట్ ఈ ప్రాజెక్టుకు ఖర్చు అవుతుంది. ఈ ప్రాజెక్టు ఇప్పుడు పూర్తిచేస్తే అనుకున్న ఆదాయం వస్తుంది ఆలస్యం అయితే ఖర్చు పెరుగుతుంది. ఈ ప్రాజెక్టులో లిఫ్ట్‌లు, టన్నల్, గ్రావిటీ ద్వారా నీటిని తరలిస్తాం. 3 టీఎంసీల నీటిని పోలవరం నుంచి తీసుకుని 1 టీఎంసీల వాడి రెండు టీఎంసీలు రాయలసీమకు పుష్ చేస్తాం. ఈ ప్రాజెక్టు చేయగలిగితే ఇండియాలోనే గొప్ప ఇరిగేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వస్తుంది. రాయలసీమతో పాటు అన్ని ప్రాంతాలు అభివృద్ధి జరుగుతుంది" అని సీఎం చంద్రబాబు తెలిపారు. "సముద్రంలో కలిసే మొత్తం గోదావరిలో 10 శాతం నీటిని మాత్రమే తీసుకుంటున్నాం. ఇది చరిత్ర తిరగ రాయబోయే ప్రాజెక్టు అందుకే దీనికి తెలుగుతల్లికి జలహారతి అన్నాం. ఇది చేయడం ద్వారా రాబోయే తరాలకు నీటి సమస్య లేకుండా చేయొచ్చు. ఆర్థిక మంత్రిను కూడా కలిసి ఇంట్రా లింకింగ్ అని చెప్పాము వారు వర్కవుట్ చేస్తామన్నారు. హైబ్రిడ్ మాడల్‌లో పెట్టుకోవాలి... కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేటు నుంచి కూడా భాగస్వామ్యం చేస్తే మంచింది. ఈ ప్రాజెక్టును డబ్బులు ఉంటే మూడేళ్లలో పూర్తిచేయొచ్చు.

# భారతరత్న ఇవ్వాలని సభలో తీర్మానం

**మన్మోహన్ సింగ్‌కు తెలంగాణ శాసనసభ సంతాపం, భారత దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు తెలంగాణ శాసనసభ సంతాపం తెలిపింది. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర శాసనసభ తీర్మానం చేశారు. కేంద్రానికి ఆ ప్రతిపాదనలు పంపనున్నారు.**



✍ జయభేరి, హైదరాబాద్:

ఆర్థిక సంస్కరలతో దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించిన వ్యక్తి మన్మోహన్ అని కొనియాడారు పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో కేంద్ర ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ దశ దిశను మార్చింది. మన్మోహన్ ఆనాడు తీసుకున్న నిర్ణయాలు నేటికి పాటిస్తున్నాం. నేడు దివంగత ప్రధానికి సంతాపం తెలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తోంది. ఇదివరకే మన్మోహన్ మృతితో ఏడు రోజుల సంతాప దినాలు ప్రకటించి అమలు చేస్తోంది. సంతాప దినాలలోనే మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలిపి, శాసనసభ వేదికగా ఘనంగా నివాళి అర్పిస్తున్నారు. ఉపాధి హామీ, ఆర్టీఐ చట్టాలు మన్మోహన్ ఘనతే. దేశ గొప్ప తత్వవేత్తను కోల్పోయింది. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆర్థికవేత్త, మానవతావాది మన్మోహన్ సింగ్. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధాన మంత్రిగా విశేష సేవలు అందించారు. దేశాన్ని ప్రగతిపథంలో నడిపించారు. ఐటీలో నేడు ప్రపంచ దేశాలతో భారత్ పోటీ పడుతుందంటే అందుకు మన్మోహన్ నిర్ణయాలే కారణం.

ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్. తెలంగాణ గడ్డపై మన్మోహన్ సింగ్ విగ్రహం పెట్టడం సముచితం అని భావిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం సభలో ప్రతిపాదన చేసింది. మన్మోహన్ విగ్రహం ఎక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందో సలహాలు, సూచనలు ఇవ్వాలని సభ్యులను కోరారు. సభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు. ఎన్ని విమర్శలు వచ్చినా తన సహనాన్ని కోల్పోలేదు. దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడంపైనే మన్మోహన్ ఫోకస్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆనాడు ఎంపీగా మాతో పాటు ఆయన ఢిల్లీలో నిరసనలో పాల్గొన్నారు. జీవిత కాలం మాకు గుర్తుండిపోయే సంఘటన అది. 2013 భూసేకరణ చట్టం తెచ్చి భూమి లేని పేదలకు మేలు చేశారు. 2006 అటవీ హక్కుల చట్టాన్ని తీసుకొచ్చారు. ఉపాధి హామీ పథకం తెచ్చి పేదలకు 100 రోజుల పని కల్పించారు.

**ప్రతిపక్షాల మద్దతు ఏకగ్రీవ తీర్మానం**

తెలంగాణ ప్రభుత్వం చేసిన తీర్మానానికి విపక్షాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఇటీవల కన్నుమూసిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శాసనసభ సంతాపం తెలిపింది. మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి శాసనసభలో తీర్మానం చేయగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బలపరిచారు. ప్రతిపక్షాలు ఈ ప్రతిపాదనకు మద్దతు తెలపాలని భట్టి కోరారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలన్న ప్రతిపాదనకు బీఆర్ఎస్ మద్దతు తెలిపింది. తమ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. మన్మోహన్ లాంటి గొప్ప ఆర్థికవేత్త, మానవతావాదికి భారతరత్న ఇవ్వాలన్న నిర్ణయానికి మద్దతు తెలిపారు. మన్మోహన్ సింగ్ గొప్పతనం, ఆయన సామర్థ్యాన్ని ముందుగా గుర్తించిన వ్యక్తి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని కేటీఆర్ కొనియాడారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కల సాకారం అయిందన్నారు. గొప్ప ఆలోచనలు ఉన్నవారిని అరుదైన సందర్భం వస్తే ప్రపంచలో ఏ శక్తి ఆపలేదన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ గారికికి నివాళులు అర్పిస్తున్నాం, ఆయన కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ తరఫున ప్రగాఢ సానుభూతి. మన్మోహన్ సింగ్ కు భారతరత్న ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానానికి పూర్తి మద్దతు ఇస్తున్నాం. పీవీ నరసింహారావు గారు ప్రధానిగా ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ ని ప్రభుత్వం లోకి నేరుగా లేటరల్ ఎంట్రీ ద్వారా తీసుకువచ్చారు. ఆర్బీఐలో పనిచేసిన మన్మోహన్ సింగ్ ని ఆర్థిక మంత్రిగా నియమించారు. భారతదేశం గురించి ప్రపంచం వినాల్సి వస్తుందని తన తొలి బడ్జెట్ ప్రసంగంలో భారత దేశ స్థితిగతులను 1991 లో మన్మోహన్ సింగ్ చెప్పారు. అన్నట్లుగానే అనేక సంస్కరణలను సాధించింది భారతదేశం. నిబద్ధత అనేది రాజకీయాల్లో అత్యంత అరుదుగా కనిపిస్తుంది. సింపుల్ లివింగ్ హై థింకింగ్ అనే జీవన విధానానికి పర్యాయపదం మన్మోహన్ సింగ్. తనకు అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘకాలం పాటు సేవ చేశారు. అధికారంలో లేనప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీతో కలిసి నడిచారు, బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్.. మన్మోహన్ సింగ్ హయాంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. శాఖల కేటాయింపులు వచ్చిన చిక్కుముడిని కేసీఆర్ తన షిప్పింగ్ శాఖను డిఎంకె పార్టీకి వదులుకున్నారు. తనకు శాఖలు ముఖ్యం కాదు, తెలంగాణ ఏర్పాటు ముఖ్యమంటూ కేసీఆర్ స్వయంగా మన్మోహన్ కి చెప్పారు. తెలంగాణ కోసం ఆరోజు ఇచ్చిన ఈ పోర్ట్‌ఫోలియో తెలంగాణ కోసం కేసీఆర్ ను ఒక ఖర్మయోగిగా మారుస్తుందని మన్మోహన్ అన్నారు. తెలంగాణ కల సాకరమయ్యే రోజు మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నారు. డిసెంబర్ 18, 2004లో ప్రధాని మన్మోహన్ సింగ్ తెలంగాణ నుంచి ఒక ముఖ్యమైన డెలిగేషన్ తీసుకొస్తున్నామని తెలిపారు. తెలంగాణ నుంచి ఓబీసీల డెలిగేషన్ తీసుకువస్తున్నామని చెప్పారు. కేవలం ఐ5 నిమిషాలు కాదు మరింత సమయం ఇవ్వాలని కేసీఆర్ కోరితే మన్మోహన్ అంగీకరించారు. ఓబీసీల సమస్యల పైన కెసిఆర్, ఆర్ కృష్ణయ్య, వకుళాభరణం ప్రతినిధి బృందానికి దాదాపు గంటన్నర పాటు అన్ని అంశాలను తెలిపారు.

### ఢిల్లీలో పీవీకి మెమోరియల్ ఏర్పాటు చేయాలన్న కేటీఆర్

మన్మోహన్ సింగ్ సైలెంట్ ఆర్కిటెక్ట్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచారు. అనేక సంస్కరణలను ఎంతో ధైర్యంగా ముందుకు తీసుకువచ్చారు. ఎన్ని నిందలు వేసిన సంస్కరణలను అద్భుతంగా తీసుకెళ్లారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాల మేరకు మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు పార్టీ బృందం హాజరై నివాళులు అర్పించాం. మన్మోహన్ సింగ్ కి హైదరాబాదులో విగ్రహం ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు సహకారం అందిస్తాం. మన్మోహన్ సింగ్‌ను రాజకీయాలకు తీసుకొచ్చిన పీవీ నరసింహారావుకు ఢిల్లీలో ఒక మెమోరియల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి. ప్రధానులందరికీ దేశ రాజధాని ఢిల్లీలో మెమోరియల్ ఉంది కానీ పివికి లేదు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఢిల్లీలో పీవీకి మెమోరియల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి. మెమోరియల్ ఏర్పాటు కోసం శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం చేస్తే బాగుంటుంది. మన్మోహన్ గారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాం' అన్నారు కేటీఆర్.



## నాగబాబు ఎమ్మెల్సీ

పనిచేసిన వారిని నేను గుర్తించాలి. నాగబాబు నాతో పాటు సమానంగా పనిచేశారు. వైసీపీ నేతలతో తిట్లు తిన్నారు. ఆయన పార్టీ కోసం నిలబడ్డారు. ఇక్కడ కులం, బంధుప్రీతి కాదు.. పనిమంతుడా కాదా? అన్నది చూడాలి. ఎంపీగా ప్రకటించి, మళ్లీ నాగబాబును తప్పించాం. పార్టీ కోసం మొదటి నుంచి మనోహర్, హరిప్రసాద్ పనిచేశారు. ఎవరికి ప్రతిభ ఉందో వారికి పదవులు ఇస్తాం. ఈ విషయంలో మీరెందుకు జగన్‌ను అడగలేదు?. కేవలం నన్ను మాత్రమే ఎందుకు అడుగుతున్నారు.?. నాగబాబు ఎమ్మెల్సీగా ఎంపికవుతారు. మంత్రి పదవి విషయంలో తర్వాత చర్చిస్తాం. నాగబాబు త్యాగం గుర్తించి రాజ్యసభకు అనుకున్నాం. కుదరలేదు కనుకే ఎమ్మెల్సీ అనుకున్నాం. మార్చిలో నాగబాబు ఎమ్మెల్సీ అవుతారు. ఎమ్మెల్సీ అయ్యాకే కేబినెట్‌లోకి వచ్చే ఛాన్స్ ఉంది. కందుల దుర్గేష్ ఏ కులమో నాకు తెలీదు. ఆయన పని తీరు నచ్చి మంత్రి పదవి ఇచ్చాను. రాజకీయాల్లో కులం కన్నా పని తీరే ప్రామాణికం' అని పవన్ పేర్కొన్నారు. అటు, 'రేషన్ బియ్యం మాయమైందని నిజమని.. డబ్బులు కట్టింది వాస్తవమని.. ఇంట్లో ఆడవాళ్ల పేరిట గిడ్డంగి పెట్టిందెవరు.?' అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. వైసీపీ నేత పేర్ని నాని చేసిన తప్పులే ఆయన ఇంట్లో వాళ్లను వీధిలోకి తెచ్చాయని అన్నారు. సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన వారిని మీరు తిట్టలేదా.? అని నిలదీశారు. 'అప్పుడు బూతులు తిట్టి ఇప్పుడు నీతులు వల్లిస్తే ఎలా.?. గత ప్రభుత్వం కన్నా కూటమి ప్రభుత్వం చాలా గొప్పగా పనిచేస్తోంది. అడ్డగోలు నిర్ణయాలపై అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. అన్ని వ్యవస్థలను నాశనం చేశారు. పని చేసే సంస్కృతిని చంపేశారు. గత ప్రభుత్వం తొలి 6 నెలలు, ఈ ప్రభుత్వం 6 నెలల బేరీజు వేసుకోండి. ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల కోసం పని చేయాలని చెబుతున్నాం. ప్రజా సమస్యల పరిష్కారం, పాలన తీరుపైనే ఇప్పటివరకూ దృష్టి సారించాం. ఇప్పుడు నేరుగా ప్రజల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. పదవులను బాధ్యతతో నిర్వర్తిస్తాం. ప్రతి గ్రామానికి తాగునీరు ఇవ్వాలనేది ప్రధాని మోదీ కల. తాగునీరు, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాం.' అని పవన్ పేర్కొన్నారు.

## సత్య నాదెళ్లతో రేవంత్ భేటీ

సర్కార్ మరింతగా దూసుకు పోతుందని చెప్పవచ్చు. అందుకు ప్రధాన కారణం కార్పొరేట్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు నిర్ణయం తీసుకోవడమే. సీఎం రేవంత్ రెడ్డిని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడుల అంశం వీరి మధ్య చర్చకు వచ్చిందని సమాచారం. అయితే తెలంగాణలో 6 డేటా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. అలాగే సీఎం భేటీలో స్కిల్ యూనివర్సిటీ, ఏఐ క్లౌడ్ కంప్యూటింగ్‌పై చర్చ సాగింది. పెట్టుబడులకు అనువైన రాష్ట్రంగా తెలంగాణ రూపుదిద్దుకోవడంతో వరుసగా పెట్టుబడులు వస్తున్నాయని కాంగ్రెస్ నాయకులు తెలుపుతున్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ గురించి తెలుసుకున్న సత్య నాదెళ్ల అదొక బృహత్తర కార్యక్రమంగా పేర్కొన్నారు. వృత్తి నైపుణ్యత సాధించడం ద్వార, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో సత్య నాదెళ్ల భేటీలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పలువురు అధికారులు కూడ పాల్గొన్నారు.

## పుష్ 2 మూవీ కలెక్షన్లలో రేవంత్‌కు 14 శాతం వాటా!?

పుష్ 2 మూవీ కలెక్షన్లలో రేవంత్‌కు 14 శాతం వాటా ముట్టిందేమోననే అనుమానం తనకు ఉందని సంచలన ఆరోపణలు చేశారు. ఇవాళ( సోమవారం) కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... తెలంగాణ అసెంబ్లీ ఎందుకు పెట్టారంటే.. అల్లు అర్జున్ కోసం అన్నట్లుగా ఉందని విమర్శించారు. అల్లు అర్జున్‌కు రేవంత్‌కు ఎక్కడో చేడిందని ఆరోపించారు. ఒక వ్యక్తి గురించి ఇంతగా అసెంబ్లీలో మాట్లాడాల్సిన అవసరం ఏంటని బండి సంజయ్ నిలదీశారు. కాంగ్రెస్‌లో అంతర్యుద్ధం జరుగుతోందని బండి సంజయ్ విమర్శించారు. కమీషన్ల విషయంలో మంత్రుల మధ్య సఖ్యత లేదని అన్నారు. కాంగ్రెస్‌లో ఏమైనా జరగొచ్చు.. వాళ్లలో వాళ్లు ఏమైనా చేసుకోవచ్చని షాకింగ్ కామెంట్స్ చేశారు. 14 శాతం కమీషన్ మీదే ప్రభుత్వం బతుకుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ముగ్గురు మంత్రుల బండారం బయట పెడతానని హెచ్చరించారు. బ్రోకర్లను పెట్టుకుని బిల్లులు మంజూరు చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మంత్రులందరికీ సీఎం కావాలని ఉందని అన్నారు. ఢిల్లీకి డబ్బులు పంపడం వల్లే.. సీఎం పదవి నిలబడుతోందని ఆరోపించారు. డబ్బులు ఇవ్వకుంటే మంత్రుల కుర్చీలు కూడా ఉండవని బండి సంజయ్ తీవ్ర విమర్శలు గుప్పించారు.



## అర్జున్ బెయిల్ పిటీషన్ వాయిదా

రెగ్యూలర్ బెయిల్ కోసం అల్లు అర్జున్ లాయర్లు ప్రయత్నిస్తున్నారు. అల్లు అర్జున్ తరఫున లాయర్ నిరంజన్ వాదనలు వినిపించారు. సంధ్యా థియేటర్ వద్ద జరిగిన ఘటనకు అల్లు అర్జున్ కు ఏం సంబంధం లేదు. రేవతి మృతికి నటుడు కారణమంటూ పోలీసులు నమోదు చేసిన కేసు చెల్లదు. బీఎన్ఎస్ సెక్షన్ 105 అల్లు అర్జున్ కు వర్తించదు. హైకోర్టు ఈ కేసులో ఇదివరకే అల్లు అర్జున్‌కు మధ్యంతర ఇచ్చింది. దాంతో రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని నిరంజన్ రెడ్డి నాంపల్లి కోర్టులో వాదనలు వినిపించారు.

మహిళా అభిమానికి రేవతి మృతికి నటుడు అల్లు అర్జున్ ప్రధాన కారణం. థియేటర్ కు ఆయన ర్యాలీ, రోడ్ షోగా రావడంతోనే థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది. నటుడికి బెయిల్ ఇస్తే తన పలుకుబడితో సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉంది. రెగ్యూలర్ బెయిల్ వస్తే అల్లు అర్జున్ పోలీసుల విచారణకు సహకరించడని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదనలు వినిపించారు. అందుకే అల్లు అర్జున్ దాఖలు చేసిన రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ ని కొట్టివేయాలని న్యాయమూర్తిని కోరారు. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన పుష్ప 2 మూవీ డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా రికార్డు స్థాయిలో 12 వేల స్క్రీన్లలో రిలీజ్ అయింది. అయితే డిసెంబర్ 4న హీరో అల్లు అర్జున్, రష్మిక మందన్నా ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్య 70 ఎంఎం థియేటర్‌కు వెళ్లి పెయిడ్ ప్రీమియర్ షో చూశారు. అయితే అల్లు అర్జున్ రాక సందర్భంగా థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళా అభిమాని చనిపోగా, ఆమె కుమారుడు తీవ్ర అస్వస్థతతో సికింద్రాబాద్ లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిక్కడపల్లి పోలీసులు సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటపై కేసు నమోదు చేసి 18 మందిని నిందితులుగా చేర్చారు. ఏ 11గా అల్లు అర్జున్ ఉండగా, ఏ18గా పుష్ప 2 నిర్మాత ఉన్నారు. ఈ క్రమంలో డిసెంబర్ 13న చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్ నివాసానికి వెళ్లి అరెస్ట్ చేశారు. అనంతరం నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టగా రెండు వారాల రిమాండ్ విధించింది కోర్టు. అదే రోజు హైకోర్టులో దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్ విచారించిన హైకోర్టు నాలుగు వారాలపాటు మధ్యంతర బెయిల్ ఇచ్చింది.

# రాజకీయ నిరుద్యోగులకు పునరావాసంగా శాసనమండలి

- పట్టభద్రుల, నిరుద్యోగులకు అందరికీ అండగా ఉంటా..!
- వాకర్స్ తో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



**జయభేరి, గజ్వేల్/ వర్గల్, డిసెంబర్ 30 :**

గత 16 సంవత్సరాలుగా ఉద్యోగ జీవితం ద్వారా ఉద్యోగుల సమస్యలు తెలిసిన వ్యక్తిగా, అదేవిధంగా గత 18 సంవత్సరాలుగా పోటీ పరీక్షల నిపుణునిగా నిరుద్యోగుల జీవితంతో ముడిపడి ఉన్న నాజీవితం రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తగిన విధంగా పట్టభద్రులకు న్యాయం చేస్తూ, వారి గొంతుకగా శాసనమండలిలో ప్రతిధ్వనించడానికి సిద్ధంగా ఉన్నానని పట్టభద్రుల ఎంఎల్సిగా పోటీ చేస్తున్నానని ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఈ సందర్భంగా వారు సోమవారం గజ్వేల్ పట్టణంలో వాకర్స్ తో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి పలు పాఠశాలల యాజమాన్యం సిబ్బందితో కలిసి మద్దతు కోరారు. వర్గల్ మండల కేంద్రంలో నిర్వహించిన పట్టభద్రులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఉద్యోగులకు చెల్లించే కరువు భత్యం, కరువు భృతులను కూడా ఏళ్లకేండ్లు చెల్లించకపోవడం హేయమైన చర్యఅని. ఇటువంటి విషయాల పట్ల శాసన మండలిలో బలంగా గొంతు వినిపిస్తానని తెలియజేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఎప్పటికప్పుడు నోటిఫికేషన్ ఇస్తూ. కాలపరిమితి లోపల ఉద్యోగ నియామకాలు చేపట్టి నిరుద్యోగులకు ప్రభుత్వం భరోసా కల్పించాలని, ఎటువంటి అనుమానాలు లేకుండా మనశ్శాంతిగా చదువుకునే పరిస్థితి ఉండాలి. చివరగా శాసనమండలి అనేది విద్యావంతులు, మేధావులు, వివిధ రంగాలలోని నిపుణులను ఎన్నుకోవడం ద్వారా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలలో వారికి భాగస్వామ్యం కల్పించాలని సదుద్దేశంతో ఏర్పాటు చేయబడింది. దానిని రాజకీయ నిరుద్యోగులకు పునరావాసంగా మార్చకూడదని, మేధావులను పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు క్లార్క్ కరుణాకర్ గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.



## పేకాట స్థావరం పై పోలీసుల దాడి

**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 30 :**

గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న కాలనీ శివారులో కొంతమంది వ్యక్తులు కలసి పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు వెళ్లి రైడ్ చేయగా 03 గురుని అదుపులోకి తీసుకున్నారు. 5 గురు వ్యక్తులు పారిపోగా, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 3,610/ వేల రూపాయలు, 03 మొబైల్ ఫోన్లు, 3 మోటార్ సైకిళ్ళు మోటార్ స్వాధీనం చేసుకున్నారు. గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని పరిశోధన ప్రారంభించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు, గజ్వేల్ పోలీసులు మాట్లాడుతూ గ్రామాలలో, పట్టణాలలో ఫామ్ హౌస్ లలో, ఇళ్ళల్లో పేకాట, బహిరంగ ప్రదేశంలో జూదం మరే ఇతర చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే లేదా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.



## శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఓ వ్యక్తి అదృశ్యం

- బయటకు వెళ్లి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఆందోళన
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**జయభేరి, డిసెంబర్ 30:**

ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా ములుగు మండలం కమలాబాద్ కు చెందిన బోయిని వెంకటేశ్ (45) నవంబర్ 27వ తేదీన మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడలోని తన కూతురు ఇంటికి వచ్చారు. మరుసటి రోజు ఉదయం కాల కృత్యాలు తీర్చుకొని వస్తానని ఇంటి నుంచి వెళ్లిన ఆయన సాయంత్రమైన ఇంటికి రాలేదు. దీంతో పరిసర ప్రాంతాలు, బంధువుల వద్ద వెతికి చూసిన ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాధిత కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

## గజ్వేల్ లో మైనంపల్లి పర్యటన విజయవంతం చేయండి

**జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 30 :**

మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నేత మైనంపల్లి హనుమంతరావు గజ్వేల్ పర్యటనను విజయవంతం చేయాలని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జనవరి 8న మైనంపల్లి హనుమంతరావు గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు చేస్తున్న పర్యటనను పురస్కరించుకొని హైదరాబాదులో ఆయనతో సమావేశమైనట్లు వారు తెలిపారు.

హనుమంతరావు గజ్వేల్ పర్యటనను విజయవంతం చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి హనుమంతరావును స్వాగతించి ఆయన పర్యటనను విజయవంతం



చేయాలని విజ్ఞప్తి చేశారు.

మైనంపల్లి హనుమంతరావు కలిసిన వారిలో పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, గోపాల్ రావు పంతులు, కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ మండల అధ్యక్షులు బయ్యారం మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు, ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా, తీగుల్ మాజీ సర్పంచ్ కప్పర భాను ప్రకాష్ రావు, పట్టణ నాయకులు మామిడి కృష్ణ, బయ్యారం మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ నాయకులు సింగం రాజు యాదవ్, యువజన కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ రెడ్డి, కృపానందం, ఎస్సీ సెల్ జగదేవపూర్ నాయకులు రతన్, భూపాల్ రెడ్డి, తిరుపతి, నల్ల శ్రీను, జానీ, రవి, సయ్యద్ బాబా తదితరులు ఉన్నారు.

## రాత్రి వేళల్లో చీకటి వ్యాపారం..

# అడ్డుకునే నాథుడే లేడు..!




- నరసన్నపేటలో గ్రామ శివారులో అర్ధరాత్రి అయితేనే జోరుగా మట్టి వ్యాపారం
- ఇటుక బట్టీల తయారీతో లక్షల్లో అక్రమ ధనార్జన
- మట్టి మాఫియా అక్రమ దారులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**జయభేరి, గజ్వేల్ (మార్కుక్):**

అక్రమ వ్యాపారాలు చేసేవారు అధికారులకు మాయమాటలు చెప్పి ధానర్జన అనే ఆశతో వారిని ఉబిలోకి దించుతున్నారు. ఏ అధికారి వచ్చిన భయపడకుండా కనుసనల్లో నల్ల మట్టి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం అధికారుల కళ్ళు కప్పి మాయమాటలతో లంచాలు ఎరవేసి అధికారులు తన వ్యాపారానికి అడ్డు రాకుండా అక్రమ ధానార్జనలో దింపుతున్నారు. వివరాల్లోకి వెళ్తే... సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం నరసన్నపేట గ్రామ శివారులో మట్టి మాఫియాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. రాత్రి వేళ వ్యాపారులు తనదైన శైలిలో అధికారులకు జతకట్టి చీకటి ముసుగులో పొలాల నుండి డంపు చేసిన నల్లమట్టిని తీసుకెళుతున్నారు. ముడుపులతో అధికారులను మత్తులో దించి తమకు అడ్డు లేకుండా మట్టి మాఫియాను వ్యవరిస్తున్నారు. ఈ మట్టితో ఇటుకల బట్టిలను తయారు చేసుకొని అధిక లాభాల ధనర్జనలో మట్టి మాఫీదారులు సొమ్ము చేసుకుంటున్నారు.

**తన భూమి ఐనా నల్ల మట్టి ఎక్కడి నుండి తెచ్చారు...!**

పొలాల్లో డంపు చేసి ఉన్న నల్లమట్టి ఎక్కడిది. ఎక్కడి నుండి తెచ్చి ఇక్కడ పోశారు అనేది ఓ ప్రశ. ఐతె నరసన్నపేట గ్రామ శివారులో ఇటుక బట్టిల కోసం నల్ల మట్టిని ఇక్కడికి గత సంవత్సరంలో పోశారు కానీ ఎక్కడి నుంచి తీసుకువచ్చి పోశారు అనేది ఓ ప్రశాగా మరిది. మట్టిని ఎక్కడి నుండి తీయాలన్న తరలించాలన్న రెవెన్యూ అధికారుల పర్మిషన్ గాని మైనింగ్ వారి పర్మిషన్ కానీ అవసరం.



**అధికారులు చూసి చూడనట్లు.....**

ఇంత పెద్ద ఎత్తున మట్టి తరలిపోతుటే గతంలో మండల బిజెపి నాయకులు 100 కు ఫోన్ చేశారు. కాగా సంఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. పోలీసుల ముందే మట్టిని అక్రమంగా తోడుతుంటే ఆపాల్సింది పోయి. పై అధికారులు చెప్తేనే హిటాచి, టిప్పర్లను వాటిని పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్తామనడం ఎంతవరకు ముడుపులు అందుతున్నాయో దానికి నిదర్శనం. కానీ ముడుపుల మాటునే అధికారులు అక్రమదారులకు సహకరిస్తున్నారు అన్నది అసలు విషయం.

**పై అధికారులు స్పందిస్తే సమస్యలు కొలిక్కి వస్తాయనేది ప్రజల వాదన**

పై విషయాలపై అధికారులు దృష్టి సారిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని అక్రమ వ్యాపారస్తులు భరతం పట్టొచ్చని అదేవిధంగా మట్టిని తోడుకపోతున్న వ్యక్తులపై చర్యలు తీసుకొని అధికారులను అప్రమత్తం చేస్తే మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయచ్చని చుట్టుపక్క గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.



## రెండు కేజీల పప్పిస్త్రా అను మత్తు పదార్థం స్వాధీనం



**జయభేరి, డిసెంబర్ 30:**

కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో పప్పిస్త్ర అను రెండు కేజీల మత్తు పదార్థం స్వాధీనం. రాజస్థాన్ నుండి వస్తుండగా కీసర పోలీస్ స్టేషన్ పరిధి యాదగిరి పల్లి చౌరస్తాలో వద్ద పట్టుకున్న మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు. ఇద్దరు వ్యక్తులు రాకేష్ బిష్ణయ్ మరియు కరణ్ సింగ్ లను అరెస్ట్ చేసి డ్రగ్స్ తో పాటు ఒక టాటా ఏసీ ట్రాలీ ఆటో. 2 మొబైల్ ఫోన్. స్వాధీనం చేసుకున్న పోలీసులు. కీసర పోలీస్ స్టేషన్ కు తదుపరి విచారణ నిమిత్తం అప్పగించడం జరిగింది.

## పెరిగిన క్రైమ్.. శామీర్ పేట్ పోలీసుల చాకచక్యం

- 123 దొంగతనాల కేసుల్లో అతి తక్కువ సమయంలో 80 శాతం రికవరీ చేసిన పోలీసులు
- రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం
- 450 కేజీల గాంజా, 800 కిలోలు, నకిలీ విత్తనాలు సీజ్
- ఎలక్షన్ కోడ్ లో భారీ నగదు సీజ్



**జయభేరి, డిసెంబర్ 30:**

శామీర్ పేట్ పోలీస్ పరిధిలో వివరాలు ఇలా గత ఏడాది 1406 పిటిషన్లు రాగా, ఈ ఏడాది 2014 పిటిషన్లు వచ్చినట్టు వెల్లడి, ఇందులో 922 ఎఫైర్ నమోదు చేయగా, లోకదాలత్ లో 391 కేసులు రాజి చేసినట్టు తెలిపారు.

**దోపిడీ దొంగలకు చెక్..**

పోలీస్ స్టేషన్ పరిధిలో 70 సెల్ ఫోన్లు పోయినట్టు ఫిర్యాదు 40 సెల్ ఫోను రికవరీ.. శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ లిమిట్స్ లో క్రైమ్ చేయాలంటే జైలుకుడు తప్పదని నిరూపించిన పోలీసులు ప్రతి విషయంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తూ ఎప్పటికప్పుడు సిబ్బంది అప్రపతం చేస్తున్న శ్రీనాథ్ క్రైమ్ చేయాలని ఆలోచన రాకుండా నేరస్తుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్న శామీర్ పేట్ పోలీసులు ఇక పూర్తి వివరాలకు వెళితే సుమారు 70 లక్షలు విలువ చేసే రత్నాలయం టెంపుల్ లో బంగారు అభరణాలతోపాటు విగ్రహాలు దొంగలించిన నేరస్థులను అతి తక్కువ సమయంలో పట్టుకొని కటకటాల పాలు చేశారు. అలాగే తుంకుంట ప్రాంతంలో ఉన్న జూలరీ షాప్ లో 80 లక్షల బంగారు వెండి ఆభరణాలు దొంగిలించిన దొంగలను సైతం కేవలం రెండు రోజుల్లో పట్టుకుని ప్రజలకు అండగా నిలిచారు. డ్రగ్స్, గాంజా విషయంలో 450 కేజీల గంజాయి నాలుగు కేసులు చేసిన పోలీసులు దీంతోపాటు రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదంటూ నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్న 800 కేజీల నోటితో వెళ్తున్నా వాహానాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఇలాగే గ్రామీణ ప్రాంతాలలో ఉండే వృద్ధులను సైతం టార్గెట్ చేసుకొని చైన్ స్నాచింగ్ తో పాటు రాబరి చేస్తున్న వ్యక్తులను చర్లపల్లి జైలుకు పంపిన ఘనత శామీర్ పేట్ పోలీసులదే...

**రోడ్డు ప్రమాదలకు చెక్**

నిత్యం ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ వాహనాల తనిఖీలు ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టారు.




## జీనోమ్ వ్యాలీలో నో క్రైం

- నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్
- 300 పిటిషన్ లకు 254 కేసులు నమోదు
- 50 శాతం కేసులను అతి తక్కువ సమయంలో చేదించిన పోలీసులు
- డ్రగ్స్ గంజా వినియోగదారులకు పూర్తిగా చెక్



**జయభేరి, డిసెంబర్ 30:**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా తుర్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేసిన జినోమి వ్యాలీ పోలీస్ స్టేషన్లో పలు కేసులపై సిఐ వెంకట్ రెడ్డి వివరణ చిన్న చిన్న దొంగతనాలు చేసిన ముఠాలకు చెక్ పెట్టి దొంగిలించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు అలాగే సైబర్ క్రైమ్ విషయంలో అలర్ట్ గా ఉండి ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి న్యాయం చేస్తున్న పోలీసులు. జీనోమి వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళపై నేరాలు జరగకుండా ఎప్పటికప్పుడు అవగాహన సదస్సు చిన్న పోలీస్ స్టేషన్ అయినా క్రైమ్ జరగకుండా ఎప్పటికప్పుడు సిబ్బందిని అలర్ట్ చేస్తూ నిఘా విభాగంలో పనిచేస్తున్న జినోమి వ్యాలీ పోలీసులు.




## లయన్స్ క్లబ్ వస్త్రాల పంపిణీ

జయభేరి, గజ్వేల్, డిసెంబర్ 30 :

సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా పార్క్ చౌరస్తా వద్ద లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గోలి సంతోష్ చేతుల మీదుగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టవల్స్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా గోలి సంతోష్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా అమావాస్య రోజున ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం వద్ద లయన్ దొంతుల సత్యనారాయణ సౌజన్యంతో టవల్స్ పంపిణీ చేయడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో లయన్ నంగునూరి సత్యనారాయణ, లయన్ నేతి శ్రీనివాస్, లయన్ దొంతుల సత్యనారాయణ, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## పదవ తరగతి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



జయభేరి, పరవాడ:

పరవాడ మండలం దేశపాత్రునిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల నందు 10 వ తరగతి చదువుతూ మార్చి 2025 పరీక్షలకు హాజరు కాబోతున్న 26 మంది విద్యార్ధిని విద్యార్థులుకు విశాఖ స్టీల్ సిటీ లైన్స్ క్లబ్ వారు ఎస్ఎస్సి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పీకమ్ లక్ష్మి, సెక్రెటరీ బి.సత్యప్రకాష్, ట్రెజరర్ ఆర్ రామచంద్ర రావు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు అర్.సుజాత, లైన్స్ క్లబ్ మెంబర్ ఎం. జగన్నాథరావు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పరవాడ రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల





జయభేరి, పరవాడ:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సులో భాగంగా సోమవారం పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం పరవాడ గ్రామ రెవెన్యూ సదస్సులో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి ఈ యొక్క రెవెన్యూ సదస్సును గ్రామ ప్రజలు ఉపయోగించుకునే విధంగా ఉదయం నుండి సాయంత్రం వరకు రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారని ఈ యొక్క అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గెడ్డ వాగులు,ప్రభుత్వ భూములు ఆక్రమించే వారిపై ఎటువంటి చర్యలు అయ్యిన తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాము అని అటువంటి వారిపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వ అధికారులు వెనక అడుగు వెయ్యొద్దని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు పరవాడ మండలం రెవెన్యూ ఆఫీసర్ అంబేద్కర్, మండల ఎంపీడీవో శ్యాంసుందర్, గ్రామ సర్పంచ్ ఎస్ అప్పలనాయుడు, ఎంపీటీసీ పైలా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చుక్కా రాము నాయుడు, మాజీ జడ్పీటీసీ పైల జగన్నాధరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు,తానం సర్పంచ్ కన్నూరు దేవివెంకటరమణ, స్థానిక ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి పైల రామచంద్రావు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామంలో పెద్దలు ఈ యొక్క కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెన్నలపాలెంను ప్రత్యేక రెవిన్యూ గ్రామంగా ఏర్పాటు చెయ్యండి

- పరవాడ రెవిన్యూ సదస్సులో ఎమ్మెల్యే పంచకర్లకు వినతి పత్రం అందజేసిన ఉపసర్పంచ్ వెన్నల



జయభేరి, పరవాడ:

పరవాడ మండలం పరవాడ గ్రామంలో సోమవారం జరిగిన రెవిన్యూ సదస్సులో వెన్నలపాలెం గ్రామం రెవిన్యూ పరవాడ, రావాడ,ఈ బోనంగి, స్వయంవరం గ్రామంలలో కలిసి ఉండడంతో రైతులు ఏ పనులకి అయ్యిన మండల కేంద్రంకి రావాల్సి వస్తుందని సమయానికి సంబందించిన విఆర్వోలు లేక రైతులు,గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకి గురివ్వాతున్నారని వీటిని అన్ని పరిగణలోకి తీసుకొని వెన్నల గ్రామాన్ని ప్రత్యేక రెవిన్యూగా గుర్తించి గ్రామానికి శ్వాసిత రెవిన్యూను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకి వెన్నలపాలెం ఉపసర్పంచ్ వెన్నల సన్యాసిరావు వినతిపత్రం అందజేశారు.

# నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పోలీసుల ఆంక్షలు

- నార్కోటిక్ స్పెషల్ ఆపరేషన్ టీం శాఖ , స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో బార్ రిసార్ట్ లు తనిఖీలు
- కొత్త సంవత్సరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి - సీఐ శ్రీనాథ్
- వేడుకల సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశాం
- మద్యం మత్తులో వాహనాలు నడపరాదు, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు
- వేడుకల్లో డ్రగ్స్ వాడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం



జయభేరి, డిసెంబర్ 30:

నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని శామీర్ పేట్ సీఐ శ్రీనాథ్ సూచించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. వేడుకలు నిర్వహించుకునే వారు తగు జాగ్రత్తలు పాటించాలనీ, ప్రమాదాలకు దూరంగా ఉంటూ పిల్లలు పెద్దలు అందరూ వారి ఇండ్లలో ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. ఇక పోలీసు వారి సలహాలు , సూచనలు పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పటిష్టమైన బందోబస్తు, పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇక పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోను డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు, అదేవిధంగా ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించే వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక పోలీసుల సూచనలు నిబంధనల గురించి సీఐ శ్రీనాథ్ వివరించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసుకునే కార్యక్రమాలు రాత్రి 12:30 గంటల వరకు పూర్తి కావాలనీ ఆనంతరం కొనసాగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇక పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలనీ, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. టపాసులు, డీజేలు నిషేధమని, మద్యం మత్తులో వాహనాలు నడపరాదన్నారు. అదేవిధంగా రహదారులు బ్లాక్ చేసి ఉత్సవాలు నిర్వహించవద్దన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించవద్దనీ, ఇల్లు, ప్రవేట్ ఆస్తులపై, వీధి దీపాల పై రాళ్లు వేయడం, అద్దాలను పగలగొట్టడం వంటివి చేయవద్దని పేర్కొన్నారు. ఇక ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ లను తీసివేసి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .ముఖ్యంగా న్యూ ఇయర్ వేడుకలలో నిషేదిత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం దుకాణాలను నిర్ణీత సమయంలో మూసివేయాలని, మైనర్లకు మద్యం అమ్మకూడదనీ సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారు . ఈ నూతన సంవత్సర వేడుకుల సందర్భంగా ఏర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమాలు అయన సరే నిర్వహాకులు తప్పని సరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తూ అనుమతులు తీసుకోవాలన్నారు.ముఖ్యంగా న్యూ ఇయర్ అఫర్ ల పేరిట సైబర్ నేరగాళ్లు ఆర్థిక నష్టం కలిగించే అవకాశం ఉన్నందున ఆన్ లైన్ నందు, అపరిచితులతో వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పిన్ నెంబర్స్ ఇవ్వవద్దన్నారు. అదేవిధంగా ప్రత్యేక పోలీసు బృందాలతో రిసార్టులు, ఫాం హౌస్ లు తనిఖీ చేస్తున్నట్లు నిషేదిత డ్రగ్స్ వాడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర సమయంలో స్థానిక పోలీసు అధికారులకు, డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసు సేవలు ఉపయోగించుకోవాలనీ సీఐ శ్రీనాథ్ సూచించారు.

# అవినీతి అధికారులపై చర్యలేవి!?

- పోస్టర్ విడుదల చేసిన డివైఎఫ్ఐ
- అక్రమ నిర్మాణాలపై స్పందించని కమిషనర్
- అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తతీసుకోవాలి




జయభేరి, హన్మకొండ, డిసెంబర్ 30:

గ్రేటర్ వరంగల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు, కట్టడాలపై చర్యలు తీసుకోవాలని అనేకసార్లు ఫిర్యాదు చేసిన స్పందించని, పట్టించుకోని కమిషనర్ పై చర్యలు తీసుకోవాలని, అవినీతికి పాల్పడుతున్న అధికారులను గుర్తించి సస్పెండ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ కార్యాలయంలో అవినీతి అధికారులను తొలగించాలని, కమిషనర్ పై చర్యలు తీసుకోవాలని పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులపై అమానుషంగా ప్రవర్తిస్తున్న కమిషనర్ పై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని, ప్రశ్నించే హక్కును రాజ్యాంగం కల్పిస్తే దానికి విరుద్ధంగా కమీషనర్ వ్యవహరిస్తుందని, ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్ పై అనేక ఫిర్యాదులు వచ్చిన అవి పెండింగ్ లోనే ఉంటున్నాయని, విచారణ చేయాల్సిన అధికారులే స్పందించకపోవడంతో అనేక అనుమానాలు వస్తున్నాయి.
మీడియాలో అక్రమ నిర్మాణాలపై కథనాలు వస్తున్నా స్పందించక పోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రేపు జరిగే సర్వసభ్య సమావేశంలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు , ఫిర్యాదుదారుల పట్ల అనుచిత వాక్యాలు చేస్తున్న కమిషనర్ ను నిలదీయాలని ప్రజా ప్రతినిధులకు ప్రజాసంఘాల తరఫున విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నోముల కిషోర్, సహాయ కార్యదర్శి చిరంజీవి, నాయకులు సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.




## వైద్యుడి దాతృత్వం ప్రభుత్వ పాఠశాలకు లక్ష రూపాయల విరాళం

- 48 సంవత్సరాలుగా మండల ప్రజలకు వైద్య సేవలు అందించిన డాక్టర్ వేదం ఆంజనేయ శాస్త్రి
- ఒక్క రూపాయితో వైద్య సేవలు అందించిన ఘనత ఆయనదే
- మండల ప్రజలు శాస్త్రి అయ్యగారు అని పిలుచుకునేవారు

జయభేరి, కొండమల్లేపల్లి :

కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన వేదం ఆంజనేయ శాస్త్రి కొండమల్లేపల్లి పట్టణంలో లక్ష్మీ క్లినిక్ పేరుతో 1977 సంవత్సరంలో హాస్పిటల్ ఏర్పాటు చేసి ఒక్క రూపాయితో వైద్య సేవలు అందించేవారు. అప్పటినుండి ఇప్పటివరకు మండల ప్రజలకు అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన వైద్యం అందించి అందరి మన్ననలు పొందారు. తన భార్య వేదం అరుణ గత కొన్ని సంవత్సరాల క్రితం అకాల మరణం పొందారు. అప్పటినుండి ప్రతి సంవత్సరం విద్యార్థులకు, పేదవారికి దానధర్మాలు చేసుకుంటూ వచ్చేవారు. కొండమల్లేపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం తన అనుచరుడు కృష్ణయ్య ద్వారా సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామావత్ నాగేశ్వరరావుకు లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు వారిని అభినందించారు. ఈ డబ్బులను 9వ తరగతి చదివే విద్యార్థులలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి ఇవ్వాల్సిందిగ ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జాను నాయక్, సైదా నాయక్, నరసింహ, శ్రీనివాస్ ,ప్రభావతి, కవిత, నాగమణి, శ్రీధర్ రెడ్డి, నాగేందర్, సిహెచ్ కృష్ణయ్య, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గుర్రపు తండాలో ఉచిత మెగా వైద్య శిబిరం

- గ్రామీణ ప్రాంతాలకు లయన్స్ క్లబ్ ఉచిత వైద్య సేవలు
- 300 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు మందులు అందజేత
- 25 మందికి కంటి శాస్త్ర చికిత్స గుర్తింపు

పేదల కోసం లయన్స్ క్లబ్ సేవలు



జయభేరి, నేరేడుగొమ్ము :

లయన్స్ క్లబ్ ఉచిత మెగా వైద్య శిబిరాల ద్వారా వందలాది మందికి అన్ని రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తున్నామని లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ అన్నారు. యశోద మలక్పేట ఆసుపత్రి వైద్యులచే నేరడుగొమ్ము మండలంలోని గుర్రపు తండాలోని అలేతియ బంజారా పాఠశాలలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ జెన్సిక లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి ప్రారంభించి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరంలో 300 మంది ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. 25 మందికి కంటి శాస్త్ర చికిత్సలు చేయడానికి గుర్తించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ మాట్లాడుతూ అందరికీ వైద్యం అందాలనే సంకల్పంతో లయన్స్ క్లబ్ మారుమూల గ్రామాలను ఎంచుకొని వారి పరిరక్షణ కోసం పనిచేస్తుందని ఏ గ్రామంలోనైనా వైద్య శిబిరాలు నిర్వహించడానికి తాము సిద్ధంగా ఉన్నామని గ్రామీణ ప్రజల సహకారం అందిస్తే మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, జెర్సీ వనం బిక్షమయ్య, లయన్ ఎం జె ఎఫ్ డి సి గాజుల రాజేష్, చీదేళ్ళ వెంకటేశ్వర్లు, వనం శ్రీనివాస్ క్యాంపు ఇన్చార్జి కర్నాటి పురుషోత్తం, ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్.రాము చౌహాన్, కిరాణా జనరల్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు నీల బుచ్చయ్య, గుద్దేటి జంగయ్య, దినేష్, అలేతియ పాఠశాల నిర్వహకులు శ్రీనివాస్, శ్రీను ప్రిన్సిపాల్ జన్సిక, హరి పాల్గొన్నారు.

## మహాధర్నాలు పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్




జయభేరి, వరంగల్, డిసెంబర్ 30:

సోమవారం భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవి కుమార్ ఆధ్వర్యంలో వరంగల్ బస్టాండ్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని నిర్వహించబడిన మహాధర్నా కార్యక్రమంలో పాల్గొన్న వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్. ఈ కార్యక్రమంలో వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, మాజీ మేయర్ తక్కళ్లపల్లి రాజేశ్వర్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ, కుసుమా సతీష్, రాష్ట్ర నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ మైదానాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ చింతకాయల



జయభేరి, పరవాడ:

పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామంలో ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు యువతకి తన సొంత నిధులు తో క్రికెట్ క్విట్ అందజేశారు మరియు క్రిడా మైదాన్నాని తన సొంత నిధులతో తయారు చెయ్యించి గ్రామంలో క్రిడా అభివృద్ధికి సహాయ సహకారులు అందిస్తామని యువతకి తెలియజేశారు. క్రిడలు ద్వారా మన పంచాయతీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కొందరు విద్యార్థులు రాణిస్తున్నారు వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా క్రీడాకారులు కూడా మన గ్రామ పంచాయతీకి మంచిపేరు తీసుకు రావాలని కోరడమైనది. అనంతరం నూతన మైదానంలో క్రికెట్ మైదానాన్ని సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో ఎంపిటీసి అర్జిల్లి దేవిరవి ,మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న ,మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు ,మాజీ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ సూరాడ ముత్యాల రావు తదితరులు పాల్గొన్నారు.

# మధుసూదన్ భారీ మెజార్టీతో ఎన్నిక

- ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులుగా సాదుల మధుసూదన్
- ప్రధాన కార్యదర్శిగా ఎన్. రమేష్ రావు
- కోశాధికారిగా పి రాఘవేందర్ రెడ్డిలు భారీ మెజార్టీతో ఎన్నిక



**జయభేరి, హైదరాబాద్:**

ట్రస్మా రాష్ట్ర శాఖ అధ్యక్షునిగా అంబర్ పేట ప్రగతివిద్యా నికేతన్ హైస్కూల్ చైర్మన్ సాధుల మధుసూదన్ భారీ మెజార్టీతో ఎన్నికయ్యారు. సాదుల మధుసూదన్ కు 2220 ఓట్లు పోల్ కాగా ఆయన సమీప అభ్యర్థి ప్రకాష్ బాబుకు 91 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. 2129ఓట్ల భారీ మెజార్టీతో ఆయన ఎన్నికైనట్లు తెలంగాణ ట్రస్మా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎన్నికల కమిషన్ చైర్మన్ నర్రా నారాయణరెడ్డి తెలిపారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి నర్రా నారాయణరెడ్డి సోమవారం మీడియా ప్రతినిధుల సమావేశంలో వివరాలు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్. రమేష్ రావు కు 2217 ఓట్లు రాగా తన సమీప ప్రత్యర్థి కే. వీరన్నకు 94 ఓట్లు పోలయ్యాయి. 2123 ఓట్ల భారీ మెజారిటీతో ఆయన విజయం సాధించారు. అదేవిధంగా కోశాధికారిగా పీ. రాఘవేంద్ర రెడ్డి 2193 ఓట్లు నమోదు కాగా సమీప ప్రత్యర్థి ఆర్. విష్ణువర్ధన్ రావుకు 118 ఓట్లు పోలయ్యాయి. పి రాఘవేంద్ర రెడ్డి 2075 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. రాష్ట్రంలోని 11,000 పాఠశాలల్లో 35,00,000 మంది విద్యార్థులకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘానికి రాష్ట్ర అధ్యక్షునిగా సాదుల మధుసూదన్ ఎన్నిక కావడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతున్నది. పోలైన ఓట్లలో 92 శాతం ఓట్లు సాధించి సరికొత్త చరిత్రకు సాదుల మధుసూదన్ శ్రీకారం పలికినట్లు అయిందని ప్రైవేట్ పాఠశాల వ్యవహర్తలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**డిజిటల్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు**

దేశంలోనే మొట్టమొదటిసారిగా డిజిటల్ బ్యాలెట్ పద్ధతిన ఎన్నికలు నిర్వహించినట్లు ఎన్నికల అధికారి నారాయణరెడ్డి తెలిపారు. తెలంగాణలోని 33 జిల్లాల నుంచి అత్యద్భుతంగా ప్రతి ఓటరు ఉత్సాహంగా ప్రతి జిల్లాలో ఆన్లైన్ లో ఓటింగ్ కు అవకాశం లభించిందని ఆయన వెల్లడించారు. అందరి సభ్యుల అభిప్రాయ సేకరణ తీసుకొని ఈ ఆన్లైన్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని కరెస్పాండెంట్ల నుంచి వచ్చిన ప్రతిపాదన మేరకు ఎంతో సాహసోపేతమైన... చరిత్రలో ఇప్పటివరకు ఎవరు చేయని విధంగా డిజిటల్ బ్యాలెట్ పద్ధతి ద్వారా ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడం విశేషం. ఆన్లైన్ పద్ధతిలో ఎన్నికలు తొలిసారి నిర్వహించినప్పటికీ 53.1 ఓటింగ్ జరిగిందని ఆయన వివరించారు. ఎన్నికల కమిషన్ నిర్ణయం మేరకు ఓటింగ్ చేసిన ప్రతి ఒక్కరికి ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. సంగారెడ్డి, ములుగు, మహబూబాబాద్, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి, జిల్లాలో 95 నుంచి 98% ఓటింగ్ జరిగిందని చెప్పారు. అదేవిధంగా జోగులాంబ, సిరిసిల్ల, నారాయణపేట, మంచిర్యాల జిల్లాలో 20 శాతం పైగా ఓటింగ్ జరిగిందని చెప్పారు. ట్రస్మాలో మొత్తం 4353 ఓట్లు ఉండగా 2311 ఓట్లు పోలయ్యాయన్నారు.

**ఎన్నిక ధ్రువీకరణ పత్రాల అందజేత**

ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్షునిగా భారీ మెజార్టీతో ఎన్నికైన సాదుల మధుసూదన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎం రమేష్ రావు కోశాధికారిగా ఎన్నికైన పి రాఘవేంద్ర రెడ్డిలకు వారు ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ట్రస్మా ఎన్నికల కమిషనర్ నర్రా నారాయణరెడ్డి తోపాటు ఎన్నికల కమిటీ సభ్యులు ఎస్. శ్రీనివాస్ రెడ్డి, రామ కవచం నాగరాజు, కే ఇన్నారెడ్డి, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, బండి లక్ష్మణ్, ఈ ప్రభాకర్ రెడ్డి, బత్తుల లక్ష్మణ్, ఆదినాథ్, పి. సుందర్, ఎస్. కొమురయ్యలు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

**ట్రస్మా కు మంచి రోజులు: ఎన్నికల కమిషనర్ నర్రా నారాయణరెడ్డి**

ప్రతీ జిల్లా నుంచి రెస్పాండెంట్లు ఉత్సాహంగా పోలింగ్ లో పాల్గొనడంతో పారదర్శకంగా జరిగిన ఎన్నికలు విజయవంతంగా ముగిశాయని తెలంగాణ ట్రస్మా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎన్నికల కమిషన్ చైర్మన్ నర్రా నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. దేశంలోని మొట్టమొదటిసారిగా డిజిటల్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి సరికొత్త చరిత్రకు శ్రీకారం పలికామని చెప్పారు. ఎన్నిక విధానం వినూత్నంగా నిలిచిందన్నారు. నూతన ఒరవడికి శ్రీకారం పలికిందని చెప్పారు. దీనివల్ల సమయం ఆదా కావడమే కాకుండా పారదర్శకంగా ప్రతి ఒక్కరు తమ ఇంటి నుంచే ఓటు వేసే అరుదైన అవకాశం కల్పించినట్లు చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు వారి సమస్యల పరిష్కారం కోసం మంచి నాయకత్వం కోసం ఇన్నాళ్లు ఎదురు చూశారని చెప్పారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల విధానంలో గెలుపొందిన నాయకులు ఆ దిశగా తమ కార్యాచరణ సిద్ధం చేసుకుని ముందుకు సాగుతారని ఆయన తన ఆశాభావం వ్యక్తం చేశారు.

**బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ సంక్షేమమే పరమావధిగా ముందుకు: రాష్ట్ర అధ్యక్షులు సాదుల మధుసూదన్**

బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ సంక్షేమమే పరమావధిగా తాను కార్యాచరణ ప్రణాళిక తీసుకొని ముందుకు సాగుతామని ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం సోమవారం అయిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో తనకు భారీ ఓట్లు వేసి గెలిపించడం ఆనందంగా ఉందని చెప్పారు. ఏ నమ్మకంతో నైతే ఓట్లేసారో అంతకంటే ఎక్కువ సంక్షేమం బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ కు జరిగే విధంగా తాను పనిచేస్తానని చెప్పారు. మారుమూల గ్రామం నుంచి హైదరాబాదు నడిబొడ్డున గల ప్రతి పాఠశాల కరస్పాండెంట్ తనపై ఓటేశారని చెప్పారు. ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర నాయకులు వినయ్ కుమార్ గౌడ్, కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి, గొట్టిపర్తి భాస్కర్, గుల్షని, బోల్ల శ్రీకాంత్, ఈ. అచ్చయ్యా గౌడ్, ఉమామహేశ్వరరావు, మంచాల రఘు సహిద్, శ్రీధర్, శ్రీనివాస్ రెడ్డిలు నూతనంగా ఎన్నికైన నాయకులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



## క్యాలెండర్ ఆవిష్కరించిన వ్యవసాయ అధికారి శ్రీనివాస్



**జయభేరి, పరకాల, డిసెంబర్ 30:**

పరకాల పట్టణానికి చెందిన ప్రముఖ ఎరువుల దుకాణం అరుణ ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ వారి 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను అరుణ ఫర్టిలైజర్ షాప్ యజమాని గందె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పరకాల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరకాల నియోజకవర్గ ప్రజలందరికీ నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలియపరుస్తూ ఈ కొత్త ఆంగ్ల సంవత్సరంలో రైతులకు పంటలు బాగా పండి సుఖ సంతోషాలతో ఉండాలని, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవనం సాగించాలని తెలిపారు.

## సీపీఐ నల్లగొండ బహిరంగ సభకు భారీగా తరలిన ఎర్ర సైన్యం




**జయభేరి, దేవరకొండ :**

నల్లగొండ జిల్లా కేంద్రంలో సోమవారం ఎన్జీ కళాశాలలో జరిగిన సీపీఐ 100 సంవత్సరాల భారీ బహిరంగ సభకు దేవరకొండ నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో సీపీఐ ఎర్ర సైన్యం కథం తొక్కుతూ,పదం పడుతూ ఎర్ర జండాలను చేతబట్టి దేవరకొండ పట్టణంలో డప్పు చెప్పుళ్లతో ఎర్ర చొక్కాలు, మహిళలు ఎర్ర చీరలు ధరించి కళాకారుల డప్పు దరువులు ఆటపాటలతో భారీ ర్యాలీ నిర్వహించారు.అన్ని మండలాల నుండి భారీ సంఖ్యలో హాజరైన శ్రేణులు తరలివెళ్తున్న వాహనాలను సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ 100 వసంతాల సీపీఐ నల్లగొండ బహిరంగ సభకు నియోజకవర్గ సీపీఐ పార్టీ శ్రేణులు నూతన ఉత్తేజంతో నల్లగొండ సభకు అనుకున్న విధంగా హాజరు కావడం శుభ పరిణామమని క్యాడర్ తరలిరావడానికి కృషి చేసిన మండల పార్టీ కార్యవర్గానికి, ప్రజా సంఘాల నాయకులను నర్సింహా రెడ్డి అభినందించారు.

## వారంలో ఒక రోజు...

- తెలంగాణ నేతల సిఫార్సులు ఓకే

**జయభేరి, హైదరాబాద్, విజయవాడ, డిసెంబర్ 30**

తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల అనుమతిపై ఏపీ సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇవాళ సీఎం చంద్రబాబుతో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు భేటీ అయ్యారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై సీఎంతో చర్చించారు. తిరుమలలో తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సిఫార్సు లేఖలను అనుమతించేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. వారానికి నాలుగు సిఫార్సు లేఖలు అనుమతించేందుకు సీఎం అంగీకరించినట్లు బీఆర్ నాయుడు పేర్కొన్నారు. వారానికి రెండు బ్రేక్ దర్శనాలు, రెండు రూ.300 దర్శనాలకు సంబంధించిన సిఫార్సు లేఖలు అనుమతించేందుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని బీఆర్ నాయుడు వెల్లడించారు. తిరుమల దర్శనాల్లో ప్రాధాన్యం దక్కడంలేదని తెలంగాణ ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం దక్కడంలేదని ఇటీవల కొందరు నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు అనుమతించాలని గత కొన్నిరోజులుగా డిమాండ్ వినిపిస్తుంది. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఈ విషయాన్ని మరోసారి ప్రస్తావించారు. ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... గతంలో తిరుమల శ్రీవారి దర్శనం విషయంలో ఎలాంటి తేడా లేకుండా జరిగేవన్నారు. కానీ ప్రస్తుతం తెలంగాణ భక్తులు, రాజకీయ నాయకులపై వివక్ష చూపుతున్నారన్నారు. తెలంగాణ ప్రజాప్రతినిధులకు టీటీడీ గతంలో కల్పించిన సౌకర్యాలను పునరుద్ధరించాలని కోరారు. తిరుమల బ్రహ్మోత్సవాలకు గద్వాల ప్రాంతం నుంచి పట్టుచీరను సమర్పించడం ఆనవాయితీగా ఉందన్న విషయం టీటీడీ అధికారులు గుర్తించాలన్నారు. తెలంగాణ వాసులకు ఆంధ్రాతో సంబంధం ఉన్న ఏకైక ప్రాంతం తిరుపతి అని, గతంలో మాదిరిగా తిరుమలలో తెలంగాణ నాయకుల సిఫార్సు లేఖలను స్వీకరించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ నాయకుల నుంచి వస్తున్న డిమాండ్ లపై ఏపీ సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. టీటీడీ ఛైర్మన్ తో చర్చించి తెలంగాణ నాయకులు సిఫార్సు లేఖలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**కియోస్క్ మిషన్లతో సులభతరంగా విరాళాలు**

టీటీడీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.1 నుంచి రూ.లక్షలోపు సులభతరంగా విరాళం ఇచ్చేందుకు తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో కియోస్క్ మిషన్లు(సెల్ఫ్ ఆపరేటెడ్ ఆన్ లైన్ పేమెంట్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ మిషన్ల ద్వారా అన్నప్రసాదం ట్రస్టుకు 50 రోజుల్లో రూ.55 లక్షలు విరాళం అందిందని టీటీడీ తెలిపింది. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, ఒంటిమిట్ట కోదండ రామాలయం, బెంగుళూరులో శ్రీవారి ఆలయంలో కూడా ఈ మిషన్లు ప్రారంభించారు. ఈ మూడు ఆలయాల్లో ఈ మిషన్ల ద్వారా 15 రోజుల్లో రూ.5 లక్షలు విరాళంగా అందిందని టీటీడీ అధికారులు తెలిపారు.పేరూరు సమీపంలోని వకుళామాత ఆలయంలో కూడా ఈ కియోస్క్ మిషన్ ను టీటీడీ ప్రారంభించింది. మరో వారం రోజుల్లో విజయవాడ, చెన్నై, హైదరాబాద్ లోని శ్రీవారి ఆలయాల్లో కియోస్క్ మిషన్లను భక్తులకు అందుబాటులో తీసుకురానున్నారు. ప్రస్తుతం అన్న ప్రసాదం ట్రస్టుకు మాత్రమే విరాళం ఇచ్చే అవకాశం ఉంది. త్వరలో టీటీడీ ఆలయాల్లోని అన్ని సేవలకు ఈ మిషన్ల ద్వారా నగదు రహిత చెల్లింపు చేసే విధానాన్ని టీటీడీ అందుబాటులోకి తీసుకురానుంది.

# మధన్న గెలుపు అభివృద్ధికి మలుపు

- సాదుల మధుసూదన్ ను ఘనంగా సన్మానించిన కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి, గొట్టిపర్తి భాస్కర్




**జయభేరి, అంబర్ పేట:**

ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులుగా భారీ విజయం సాధించిన ప్రముఖ విద్యావేత్త సాదుల మధుసూదన్ ను యాదగిరిగుట్ట ఎస్.వీ.ఎన్ డిజిటల్ హైస్కూల్ వ్యవస్థాపకులు గొట్టిపర్తి భాస్కర్, దిల్ సుక్ నగర్ లోటస్ ల్యాబ్ పబ్లిక్ స్కూల్స్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి లు ఘనంగా సన్మానించారు. సోమవారం అంబర్ పేటలోని ప్రగతి విద్యానికేతన్ లో సాధుల మధుసూదన్ ను వారు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధుసూదన్ నాయకత్వంలో బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలు అభివృద్ధి బాటలో పయనిస్తాయనే నమ్మకం ఉన్నదని చెప్పారు. మదన్న అంటేనే నమ్మకం... మదన్న అంటేనే భరోసా... అందువలనే పోలైన ఓట్లలో 92 శాతం ఓట్లు సాధించి విజయదుందిమోగించారని వారు ఈ సందర్భంగా ప్రశంసించారు. ఇది సరికొత్త చరిత్రకు నాంది పలికిందని చెప్పారు.


ఇప్పటివరకు ఎక్కడా లేనివిధంగా డిజిటల్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి ప్రతి కరస్పాండెంట్ ఓటు వేసే వాతావరణం కల్పించిన ఘనత వారికి దక్కిందని చెప్పారు.

# పవన్ కామెంట్స్ పై బండి సెటైర్లు

**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 30**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యామ్ కామెంట్స్‌పై.. కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందించారు. పవన్‌కు రేవంత్ ఏ విషయంలో గొప్పగా కనిపించారని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలని పక్కదారి పట్టించాలని చూస్తున్నారని విమర్శించారు. అల్లు అర్జున్, రేవంత్‌కి ఎక్కడ చెడిందోనని వ్యాఖ్యానించారు. పుష్ప3 రిలీజ్‌కు ముందే.. అల్లు అర్జున్‌కి రేవంత్‌రెడ్డి సినిమా చూపించారని అన్నారు.

'14శాతం కమీషన్ దగ్గర చెడిందేమో. ముగ్గురు మంత్రులు కమీషన్లు వసూలు చేస్తున్నారు. సచివాలయం, మంత్రుల పేషీలు కమీషన్లకు అడ్డాగా మారాయి. ఇక్కడి కమీషన్లతో ఢిల్లీకి కప్పం కడుతున్నారు. మంత్రులందరికీ సీఎం కావాలని ఉంది. ఢిల్లీకి డబ్బులు పంపడం వల్లే సీఎం పదవి నిలబడుతోంది' అని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు.అల్లు అర్జున్ వ్యవహారం గోటితో పోయేదానికి గొడ్డలి వరకూ తెచ్చారు. రేవంత్ రెడ్డి డైనమిక్ లీడర్. వైసీపీ ప్రభుత్వంలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం లేదు.



బెనిఫిట్ షోలు అధిక ధరలు ఉనప్పుడు కలెక్షన్స్ వస్తాయి. సలార్, పుష్పా సినిమాలకు అందుకే రికార్డ్ కలెక్షన్లు వచ్చాయి. అంచనాలు ఎక్కువగా ఉన్న సినిమాలకు ఫాన్స్ ఎక్కువగా వస్తారు. సినిమా థియేటర్లకు హీరోస్ వెళ్లడం వల్ల ఇబ్బందులు వస్తాయి. నేను మొదట్లో మూడు సినిమాలకి వెళ్లి పరిస్థితి అర్థం చేసుకుని ఆగిపోయాను' అని పవన్ కల్యాణ్ వివరించారు'అల్లు అర్జున్‌కు స్టాఫ్ చెప్పి ఉండాల్సింది. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం సాఫ్ట్‌గా వెళ్లి ఉంటే బాగుండేది. చనిపోవడం చాలా బాధాకరం. ఘటన జరగ్గానే సినిమా హీరో లేదా నిర్మాతలు లేక దర్శకుడు వాళ్ల ఇంటికి వెళ్లి సపోర్ట్ ఇవ్వాల్సింది. మీ బాధలో మేమున్నాము అని భరోసా ఇవ్వాల్సింది. అల్లు అర్జున్ వెళ్లడం కుదరకపోయినా.. మిగిలిన వాళ్లు వెళ్లాల్సింది. అలా వెళ్లకపోవడం పొగరు అనుకుంటారు. ఆ కుటుంబానికి జరిగిన నష్టానికి మద్దతు ఉండాలి' అని పవన్ అభిప్రాయపడ్డారు.

**రేవంత్ బాగా ప్రోత్సహించారు..**

'రేవంత్ రెడ్డి సినిమా రంగాన్ని బానే ప్రోత్సహించారు. బెనిఫిట్ షో అధిక ధరలకు అనుమతి ఇచ్చారు కదా. రేవంత్ రెడ్డి పేరు చెప్పలేదని అలా చేశారని అనుకోవడం లేదు. రేవంత్ రెడ్డి అలాంటి వాటినన్నింటినీ మించిన నాయకుడు. రేవంత్ రెడ్డి నాకు చాలా కాలంగా తెలుసు. వన్స్ కేసు నమోదు అయ్యాక చట్ట ప్రకారం జరిగిపోయింది. రేవంత్ రెడ్డిని తప్పు బట్టలేము. ఆస్థానంలో ఎవరున్నా చట్ట ప్రకారం ఫాలో అవుతారు. లాలూచీ పడితే మీడియా, ప్రజలు తిట్టారా. అది పెద్ద డిఫికల్ట్ సిచ్యుయేషన్' అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.

## జయసుధకు మరోసారి నోటీసులు



**జయభేరి, విజయవాడ, డిసెంబర్ 30**

రేషన్ బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి జయసుధకు అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ...పేర్ని జయసుధకు తాజాగా నోటీసులు జారీ చేశారు. పేర్ని జయసుధకు చెందిన గోదాములో రేషన్ బియ్యం మాయంపై విచారణ చేపట్టిన ప్రాథమిక విచారణ చేపట్టిన పౌరసరఫరాల శాఖ అధికారులు 185 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం షార్టేజ్ వచ్చినట్లు గుర్తించారు. ఇందుకు పేర్ని నాని రూ.1.68 కోట్ల జరిమానా చెల్లించారు. అయితే పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టిన పౌరసరఫరాల అధికారులు మొత్తం 378 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం మాయమైనట్లు గుర్తించారు. దీంతో పెరిగిన షార్టేజీకి కూడా జరిమానా విధించాలని తాజాగా మరోసారి నోటీసులు జారీ చేశారు. అదనంగా మరో రూ.1.67 కోట్లు చెల్లించాలని పేర్ని జయసుధకు జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ నోటీసులు ఇచ్చారుమాజీ మంత్రి పేర్ని నాని సతీమణికి చెందిన గోదాములో బియ్యం మాయం కేసులో పోలీసులు స్పీడ్ పెంచారు. గోదాము మేనేజర్ మానస తేజను, కృష్ణా జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ కోటి రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో కోటి రెడ్డికి ప్రమేయం ఉందని పోలీసులు భావిస్తున్నారు. పేర్ని నాని గోదాములో రేషన్ బియ్యం మాయం ఘటనపై కోటి రెడ్డి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. బియ్యం మాయం అంశంలో తనపై అనుమానం రాకుండా కోటిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారని సమాచారం. ఈ కేసులో మచిలీపట్నం జిల్లా కోర్టులో పేర్ని జయసుధ ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.పేర్ని నాని గోదాములో రేషన్ బియ్యం మాయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. గోదాములో రేషన్ బియ్యం మాయమైన విషయం నిజం, డబ్బులు కట్టింది వాస్తవం అన్నారు. ఇంట్లో ఆడవాళ్ల పేరుతో గోదాము పెట్టిందెవరని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన వారి గురించి వైసీపీ నేతలు ఎంతలా తిట్టారో మర్చిపోయారా అని నిలదీశారు. మంగళగిరిలో పవన్ కల్యాణ్ మీడియాతో చిట్ చాట్ లో మాట్లాడారు. పేర్ని నాని చేసిన తప్పులే ఆయన ఇంట్లో వాళ్లను వీధిలోకి తెచ్చాయన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బూతులు తిట్టి, ఇప్పుడు నీతులు వల్లిస్తే ఎలా? అని ప్రశ్నించారు.వైసీపీ ప్రభుత్వం కన్నా కూటమి ప్రభుత్వం గొప్పగా పనిచేస్తుందని పవన్ కల్యాణ్ అన్నారు. వైసీపీ అడ్డగోలు నిర్ణయాలపై అధికారులు చెప్పలేకపోతున్నారన్నారు. అన్ని వ్యవస్థలను నాశనం చేసి, పని సంస్కృతిని చంపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం తొలి 6 నెలలు, కూటమి ప్రభుత్వం 6 నెలల పాలన బేరీజు వేస్తే...ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉందన్నారు. ఇప్పటి వరకు పాలన తీరు, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టామన్నారు. ఇకపై నేరుగా ప్రజల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

# ఆర్థిక శాఖలో ఒక విప్లవాత్మకమైన ఆలోచన

■ పీవి నర్సింహారావు

జయభేరి, హైదరాబాద్ :



మాజీ పీవి నర్సింహా రావు ఒక సముద్రము, 1921నుండి 2004 వరకు న్యాయవాది, భారత దేశానికి తొమ్మిదవ ప్రధానిగా 1991నుండి 96 వరకు ప్రధానిగా బాధ్యతలు తీసుకున్నారు,తెలంగాణ లోని వరంగల్ జిల్లా నర్సంపేట మండలములో లక్నె పల్లి గ్రామములో 1921జూన్ 28 న రుక్మా బాయి సీతా రామారావు దంపతులకు పి వి నర్సింహా రావు జన్మించారు, 1938 లో కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యి నిజాము ప్రభుత్వ విషయాలను దిక్కరిస్తూ వందేమాతరము గీతాన్ని పాడారు, దానితో ఉస్మాని యా విశ్వ విద్యాలయము నుండి బహిష్కరించబడ్డా రు,పై చదువులు చదివి యువనాయకులు మర్రి చెన్నా రెడ్డీతో కాంగ్రెస్ పార్టీలో పనిచేశారు, ఆ కాలములో 1951 అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యుడుగా స్థానము సంపాదించి,కాకతీయ పత్రిక నడిపి, జర్న లిస్టుగా, 1950లో వార్తలు రాసేవారు, బహుబాషలు నేర్చిన జ్ఞాన వంతుడు అని, 1957లో మంథని నుండి ఎన్నిక శాసనసభ్యునిగా అడుగుపెట్టారు, యిదే నియో జకవర్గం నుండి నాలుగుసార్లు ఎన్నిక, 1962లో మంత్రిగా 1964 వరకు న్యాయ సమాచార మంత్రిగా 1964నుండి 67 వరకు దేవాదాయ శాఖ మంత్రిగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి 1968 71వరకు న్యాయ సమాచార మంత్రి 1971ముఖ్యమంత్రిగా సెప్టెంబర్ 30 న బాధ్యతలు స్వీకరించి, కుర్చీలో కూర్చోగానే అసమ్మతి ఎక్కువయింది. ఢిల్లీ హైదరా బాద్ తిరగడము సరిపోయింది, 1972లో శాసనసభ ఎన్నికలలో 72%వెనుక బడిన వారికీ యిచ్చి చరిత్ర సృష్టించాడు, 1973 నూతన మంత్రి వర్గము ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని పీవి నర్సింహారావ్,కోపాన్నిదాచి ప్రేమగా మాట్లాడే వాడని ఇన్నయ్య పుస్తకములో రాసారు, అన్నిటికి సిద్ధపడి వచ్చేవారని 1983 అలీన శిఖరాగ్ర సమావేశాలలో స్పానిష్ భాషలో మాట్లాడి అక్కడి దేశ అధ్యక్షుడు పిడల్ క్యాస్ట్రో ను అబ్బురపరి చాడట, పి వి నర్సింహా రావు 1991లో పోటీచేయక మానుకుంటే అనుకోని సంఘటన,రాజీవ్ గాంధీ హత్య తర్వాత సమర్ధమయిన నాయకునికొరకు చూసారు, ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల లోకసభ నుండి గంగుల ప్రతాప్ రెడ్డిచే రాజీనామా చేయించి ఉప ఎన్నికల్లో గెలిచి లోకసభలో అడుగు పెట్టాడు పి వి నరసింహారావ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అపర చాణుక్యుడు అని బిరుదు ఉంది, అప్పటికే ఆర్థిక ప్రణా ళికలు పరిస్థితులు ఎలా ఎదుర్కోవాలి అనే వాటిలో మహా జ్ఞాన వంతుడని పేరు, ఎన్నో మలుపులు తిప్పి ఆర్థిక సంక్షోబములో ఉన్న దేశాన్ని ఒక ఆలోచన ద్వారా గొప్ప జ్ఞానిని ఆర్థిక శాఖలో మన్మోహన్ సింగ్ ను సరి అయిన సమయములో మంత్రిగా అవకాశము బాధ్యతలు యిచ్చి,ఆయనకు స్వేచ్చను యిచ్చి దేశము ఆర్థిక యిబ్బందుల్లో బీజము వేసి మన్ మోహన్ సింగ్ ను ఆర్థిక మంత్రిగా అవకాశము యిచ్చి అతని ద్వారా నూతన మార్పులు చూశారు, ఆ సంస్కరణల పర్యా వసనమే ఆ తర్వాత భారత ఆర్థిక వ్యవస్థ సాధించిన అభివృద్ధి, అని చెబుతున్నారు.

ఒక ఫోన్ కాల్ ఎవరిదీ ఇది తెలుసుకోవాలి అంటే దేశాన్ని గాడిలో పడెయ్యాలంటే ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి అని ఎవరు సమర్డులు అని నిర్ణయము తీసుకొని ముందుకు వెళ్ళడము పీవి నర్సింహా రావు గొప్పతనము అనచ్చు ఒక అద్భుత ఆలోచన అస్త్ర ము, ఆ అస్త్రములో ఒక మౌన వృక్ష శాస్త్రము ఆ ఆర్ బి ఐ గవర్నర్ మన్ మోహన్ సింగ్ ఊహించని ఫోన్ కాల్ ఆలోచించని మంత్రి పదవి దేశములో మలుపు ఆర్థిక వ్యవస్థ 1991 లో దేశములో ఆర్థిక సంక్షోబ ము తార స్థాయికి చేరుకున్న రోజుల్లో ప్రధానిగా పి వి నర్సిహరావు అధ్యక్షతన పరిస్థితి అప్పటికి అన్ని అప్పులతో ఉంది, పరిస్థితి సోవియట్ యూనియన్ పతనము సంక్శోభ దిశలో ఆలోచన అప్పటి మాజీ ప్రధాని పీవీ నర్సింహ రావు ఎలా ఏమిటి అని ఆలో చిస్తూ ఒక ఆలోచనలో అప్పటికే ఆర్ బి ఐ గవర్నర్ గా 1982 నుండి 85 వరకు గవర్నర్ గా పనిచేసిన జ్ఞాని, అతనే మన్ మోహన్ సింగ్ మాజీ ప్రదాని ఒక రోజు ఒక ఫోన్ కాల్ వచ్చింది, మన్ మోహన్ సింగ్ కు అలక్సాండర్ నుండి ఫోను కాల్ రేపు మీరు కేం ద్రములో ఆర్థిక శాఖ మంత్రిగా వస్తున్నారు అనగా ఊహించని ఆలోచన మన్ మోహన్ సింగులో తన కుమార్తె రాసిన స్ట్రిక్టి పర్సనల్ పుస్తకములో మన్ మోహన్ గురు శరణ్ పుస్తకములో ప్రస్తావించారట మన్ మోహన్ సింగ్ పాకిస్తానులోని గాహ్ పశ్చిమ పంజాబులోని 1932 సెప్టెంబర్ 26గాహ్ ప్రాంత ములో జన్మించారు.

**1991 జూన్ 21 న ఆర్థిక శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారము**

ఇతర ప్రపంచములోని కొన్ని దేశాలకు అప్పుల నుండి విముక్తి కలగాలంటే తీసుకున్న నిర్ణయము అందులో ఒక భాగము సువర్ణము, ఆర్ బి ఐ 44 టన్నుల బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వద్ద కుదువ బెట్టి కొంత మట్టుకు దేశములో అప్పుల యిబ్బందులను తగ్గించారు మన్మోహన్ సింగ్ ప్రతీ పక్ష నాయకులతో యిబ్బంది ఎదుర్కొన్నా ఆర్థిక మంత్రిగా వస్తువుల మీద గ్యాస్ ఎరువులు యిలా రేట్లు పెంచడము వల్ల కాంగ్రెస్ లోకూడా వ్యతిరే కత చూసారు కాని మాజీ ప్రధాని పీవి నర్సింహా రావుకు వివరించి అందరిని మెప్పించిన మంత్రి మన్మోహన్ సింగ్ కొంత ఎరువుల మీద కొంత రేటు తగ్గించారు, లిబరైలెజెషన్ ప్రవైటేజేషన్ గ్లోబలైజెషన్ పాలసీతో దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ యిటి వల నరేంద్ర మోదీ ప్రభుత్వము కూడా పీవి నర్సింహా రావు మన్మోహన్ సింగ్ చేపట్టిన ఆర్థిక సంస్కరణలు గుర్తుచేసుకున్నా రని భారత మంత్రిత్వ శాఖలో మంత్రి గా చేసి పదేళ్లు ప్రధానిగా చేసిన మన్మోహన్ సింగ్ పీవి నర్సింహారా వ్ శిష్యుడు అనిపించుకొని ఈ రోజు దేశము ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధికి ముందంజలో ఉంది అంటే మన్మోహన్ సింగ్ పీవి నర్సింహారావు వారు ఆరోజు చేసిన సంస్కరణలే అని చెబుతున్నారు. తెలుస్తుంది కూడా శక్తి వంతమైన భారత్ గా తీర్చిదిద్దిన మన్మో హన్ సింగ్ మాజీ ప్రధాని 2004మే 22 న బాధ్యతలు ప్రధానిగా తీసుకున్నారు 2005 లో పేదరిక నిర్మూలన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రవేశ పెట్టిన దీరుడు సమాచార హక్కు చట్టము తెచ్చారు 2008 లో అణు ఒప్పందము పై అమెరికా మన్ మోహన్ సంతకము పెట్టారు అణు మార్కెట్లో దారి దొరికింది లెఫ్ట్ పార్టీలు వ్యతిరేకించిన ఉపసంహరించుకోలేదు వెనక్కి పోలేదు, దేశ ప్రయోజనాలు ముందుండి నిల బెట్టారు యిలా మన్ మోహన్ సింగ్ చేసిన కృషి పి వి నర్సింహారావ్ చేసిన కృషి ఇంతా అంతా కాదు యిలా దేశములోని ప్రజలకోసము ఎంతో ఆరాట పడ్డ అపర మేధావులు మహా జ్ఞానులు శాస్త్రవేత్త నీసీత సూక్ష్మ ఆలోచనా పరులు, వారి కృషి మరిచిపోని ఒక నిధి అని ప్రజలందరూ మేధావులు శాస్త్ర వేత్తలు జ్ఞానులు కొనియాడుతున్నారు.

శోభన్ బాబు
సీనియర్ రిపోర్టర్, సెల్ : 81062 61026

# సీఎం రేవంత్ పాలన భేష్..



■ అనవసర రాద్ధాంతం చేయవద్దు

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 30:

టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్ అరెస్టుపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎట్టకేలకు స్పందించారు. అభిమాని రేవతి చనిపోయిన విషయం తెలిసిన వెంటనే బాధితులను పరా మర్శించాలి కానీ, గోటితో పోయే దాన్ని గొడ్డలి దాకా తెచ్చుకున్నారంటూ చిట్ చాట్ లో పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అల్లు అర్జున్ మాత్రమే కాదు, వాళ్ల టీమ్ అయినా వెంటనే మృతిచెందిన వారి కుటుంబసభ్యు లను కలిసి పరామర్శిస్తే సరిపోయేదన్నారు. మానవతా ధృక్పథం లోపించినట్లు కనిపి స్తుందనారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పరిపాలపై పవన్ కళ్యాణ్ ప్రశంసలు కురిపిం చారు. రేవంత్ రెడ్డి కాబట్టే హీరో అయిన అల్లు అర్జెన్‌ను అరెస్టు చేయగలిగారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని, బన్నీ స్థానంలో రేవంత్ రెడ్డి ఉన్నా అరెస్ట్ చేస్తారని కామెంట్ చేశారు. తన పేరు చెప్పలేదని అల్లు అర్జున్ ను రేవంత్ రెడ్డి అరెస్టు చేశారని అనడం పెద్ద తప్పు అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ ఆ స్థాయి దాటిన బలమైన నేత అన్నారు.

తెలుగు పరిశ్రమకు రేవంత్ ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తోంది. పుష్ప 2 బెనిఫిట్ షోలు ఇవ్వడం, టికెట్ రేట్లు పెంపు నిర్ణయం సినిమాలను ప్రోత్సహించడమే అన్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన, అల్లు అర్జున్ అరెస్టుపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖలు వైరల్ అవుతున్నాయి.

అసలే మెగా వర్సెస్ అల్లు ఫ్యామిలీ అని ఎప్పటి నుంచో ప్రచారంలో ఉంది. తామంతా ఒకటేనని వారు పలు ఈవెంట్లలో స్టేజీ మీద చెప్పేశారు. అల్లు అర్జున్ సినిమాల ప్రిరిలీజ్ ఈవెంట్లలో పవర్ స్టార్ పవర్ స్టార్ అని, లేక పవన్ కళ్యాణ్ పవన్ కళ్యాణ్ అని మెగా ఫ్యాన్స్ అరవడం తెలిసిందే. కెరీర్ మొదట్లో మెగాస్టార్ చిరంజీవి గురించి మాట్లాడిన అల్లు అర్జున్ గత కొన్ని సినిమాల నుంచి మెగా అనే ప్రభావం తగ్గిస్తూ వస్తున్నారు. పుష్ప సినిమాకు అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడు వచ్చిన తరువాత పవన్ కళ్యాణ్ ను స్పందన అడిగితే గంజాయి స్మగ్లింగ్ చేసే సినిమాకు జాతీయ అవార్డులు రావడం ఏంటోనని చేసిన వ్యాఖ్య లు దుమారం రేపాయి.

**ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో నంద్యాల ప్రచారంపై వివాదం**

ఏపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో పవన్ కళ్యాణ్ కోసం మెగాస్టార్ చిరంజీవి కుటుం బసభ్యులు తమ వీలు చూసుకుని ప్రచారంలో పాల్గొన్నారు. లేకపోతే నేరుగా పిఠాపురం వెళ్లి పవన్ కళ్యాణ్‌ను కలుసుకుని మద్దతు తెలిపారు. అందుకు భిన్నంగా పుష్ప 2 హీరో అల్లు అర్జున్ నంద్యాలకు వెళ్లి వైసీపీ అభ్యర్థికి మద్దతు తెలపడం వివాదాన్ని రాజేసింది. నంద్యాల సిట్టింగ్ ఎమ్మెల్యే శిల్పా రవిచం ద్ర కిశోర్‌రెడ్డికి మద్దతు తెలిపేందుకు అల్లు అర్జున్ నంద్యాలకు వెళ్లిన సమయంలో మెగా వర్సెస్ అల్లు ఫ్యామిలీగా సమీకరణాలు మా రిపోయాయి. మరోవైపు పవన్ కళ్యాణ్ పార్టీ జనసేనకు మద్దతు తెలపలేదు కానీ, నంద్యా లకు వెళ్లి మరీ వైసీపీ వారిని కలవడం రాజకీ యంగానూ దుమారం రేపింది. తెలంగాణ ప్రభుత్వం పుష్ప 2 సినిమాకు బెనిఫిట్ షోలు, టికెట్ల ధరల పెంపుపై ముందుగానే నిర్ణయం తీసుకోగా, ఏపీలో మాత్రం కాస్త ఆలస్యమైంది. పుష్ప 2 ప్రి రీలీజ్ జరుగుతున్న సమయంలో ఏపీ ప్రభుత్వం టికెట్ రేట్ల పెంపుతో పాటు బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వడం తెలిసిందే. ఇటీవల జరిగిన పుష్ప 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ చూసిన ఎవరికైనా అది నిజం కాదనిపిస్తుం ది. ఎందుకంటే ఆ ఈవెంట్ కేవలం అల్లు ఈవెంట్ అని, మెగా ఫ్యామిలీ, మెగా అనే పదానికి సంబంధమే లేదన్నట్లుగా జరిగింద ని అంతా గమనించారు. కానీ అల్లు అర్జున్ అరెస్ట్ అని తెలియగానే చిరంజీవి విశ్వంభర షూటింగ్ రద్దుచేసుకుని వెంటనే అల్లు అర్జున్ ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. నాగబాబు సైతం వెళ్లారు. చివరగా జైలు నుంచి వచ్చాక అల్లు అర్జున్ కుటుంబంతో వెళ్లి చిరంజీవిని కలవడం చూసిన వారు ఆఫ్యామిలీ అంతా ఒకటేనని చూపిస్తున్నారు. ఈ క్రమంలో పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు టార్గెట్ చేసి చేసినవి కాకపోయినా, అదే అర్థం వస్తుందని నెటిజన్లు, ఐకాన్ స్టార్ ఫ్యాన్స్ రియాక్ట్ అవుతున్నారు.సంధ్య థియేటర్ తొక్కి సలాట ఘటనలో అరెస్టైన అల్లు అర్జున్ రెగ్యు లర్ బెయిల్ పిటిషన్ డిసెంబర్ 27న దాఖలు చేశారు. నాంపల్లి కోర్టు విధించిన 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ గడువు ముగియడంతో వర్చువల్‌గా కోర్టు విచారణకు నటుడు హాజ రయ్యారు. హైకోర్టు అల్లు అర్జున్‌కు మధ్యం తర బెయిల్ మంజూరుచేసిందని, రెగ్యూలర్ ఇవ్వాలని ఆయన తరఫు లాయర్ నిరంజన్ రెడ్డి నాంపల్లి కోర్టును కోరారు. నేడు పోలీసులు దాఖలు చేసిన బెయిల్ కౌంటర్ పిటిషన్ ను వి చారించిన నాంపల్లి కోర్టు తీర్పును జనవరి 3కి వాయిదా వేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న నాంపల్లి కోర్టు తీర్పును రిజర్వ్ చేయడంతో అల్లు అర్జున్ అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. నాంపల్లి కోర్టు ఆయనకు బెయిల్ ఇస్తుందా లేదా అనే చర్చ మొదలైంది.




# ఎంసీజీలో పోరాడలేక ఓడిన భారత్

జయభేరి, మెల్ బోర్న్ డిసెంబర్ 30:

మెల్‌బోర్న్ టెస్టు ఫలితం టీమిండియాకు అనుకూలంగా రాలేదు. దీంతో ఆస్ట్రేలియా 184 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ భారీ విజయంతో సిరీస్‌లోనూ ముందంజ వేసింది. మెల్‌బోర్న్ టెస్టులో భారత్‌కు 340 పరుగుల విజయలక్ష్యాన్ని ఆస్ట్రేలియా ని ర్దేశించగా, దానిని ఛేదించే క్రమంలో టీమిండియా రెండో ఇన్నిం గ్స్‌ను 155 పరుగులకే పరిమితం చేసింది. టోటల్ 300 ప్లస్ ఛేజింగ్ లో టీమ్ ఇండియా ఓటమిని ఎదుర్కోవడం టెస్టు క్రికెట్ లో ఇది 49వ సారి కావడం విశేషం.

**చరిత్ర సృష్టించే అవకాశాన్ని చేజార్చుకున్న భారత్..**

నాలుగో రోజు 9 వికెట్లు కోల్పోయి 333 పరుగుల ఆధిక్యంలో ఉన్న ఆస్ట్రేలియా.. 5వ రోజు తన స్కోరుకు మరో 6 పరుగులు జోడించి భారత్‌కు 340 పరుగుల లక్ష్యాన్ని అందించింది. ఈ లక్ష్యాన్ని అధి గమిస్తే MCGలో టీమిండియా చరిత్ర సృష్టించినట్లే అవుతుంది. ఎందుకంటే ఇప్పటివరకు ఈ మైదానంలో అత్యంత విజయవం తమైన ఛేజింగ్ విషయానికి వస్తే 332 పరుగులు. కానీ, ఇది జర గలేదు.మెల్ బోర్న్ టెస్టులో టీమిండియా రెండో ఇన్నింగ్స్ కేవలం 155 పరుగులకే పరిమితమైంది. భారత జట్టులో ఓపెనర్ యశస్వి జైస్వాల్ అత్యధికంగా 84 పరుగులు చేశాడు. 208 బంతులు ఎదుర్కొంటూ ఈ పరుగులు చేశాడు. జైస్వాల్ కాకుండా, 340 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే సమయంలో 30 పరుగుల ఇన్నింగ్స్ ఆడిన రిషబ్ పంత్ జట్టులో రెండవ టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

**ఇరుజట్లు:**

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లీ, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా, నితీష్‌రెడ్డి, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్.
ఆస్ట్రేలియా: పాట్ కమిన్స్ (కెప్టెన్), ఉస్మాన్ ఖవాజా, సామ్ కాన్‌స్టా న్స్, మార్నస్ లాబుషాగ్నే, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్, అలెక్స్ కారీ (వికెట్ కీపర్), మిచెల్ స్టార్క్, నాథన్ లియోన్, స్కాట్ బోలాండ్.



# న్యూ ఇయర్ పార్టీలో ఎలాంటి డ్రెస్ వేసుకోవాలో తెలియడం లేదా?

మెట్రో సిటీల్లో న్యూ ఇయర్ వేడుకలు ఆకాశాన్నంటుతాయి. యువత క్రేజీగా ఈ వేడుకలను నిర్వహించుకుంటారు. ఎక్కువ మంది రెస్టారెంట్లు, పబ్ లలో కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతారు. ఈ పార్టీకి ఎలాంటి డ్రెస్ వేసుకోవాలా అని ఆలోచిస్తున్నారా? ఈ బాలీవుడ్ తారల డ్రెస్సింగ్ గమనించండి.

న్యూ ఇయర్ పార్టీ అంటే చాలు యువత క్రేజీగా మారిపోతారు. డ్రెస్ దగ్గర నుంచి హెయిర్ స్టైల్ వరకు ఎలా తయారవ్వాలని తెగ ఆలోచిస్తారు. బెస్ట్ పార్టీ లుక్స్ కోసం నెట్ లో వెతుకుతూ ఉంటారు. పార్టీలో స్నేహితులతో సరదాగా గడపుతూ కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతారు. మీరు కూడా స్నేహితులతో పార్టీకి సిద్ధ మవుతుంటే మంచి డ్రెస్సింగ్ ఎంచుకోండి. అందుకోసం మీరు ఇక్కడ ఇచ్చిన బాలీవుడ్ తారల డ్రెస్సింగ్ ను గమనించండి. మీకు నచ్చితే ఇలాంటి డ్రెస్ లు లేదా హెయిర్ స్టైల్స్ వంటివి ఎంపిక చేసుకోవచ్చు.




**జాన్వీ కపూర్ రెడ్ సైరన్ లుక్**

జాన్వీ కపూర్ వేసుకున్న ఈ రెడ్ డ్రెస్ ఎంతో అందంగా ఉంది. ఈ రెడ్ డ్రెస్ న్యూ ఇయర్ సందర్భంగా గ్రేట్ నైట్ అవుట్ పిక్. శరీరంపై కటౌట్, ప్లంపింగ్ నెక్లైన్, బాడీ హగ్గింగ్ సిల్హౌట్ ఉన్నాయి. జాన్వీ కపూర్ లాగా లూజ్ లాక్స్, మినిమమ్ గ్లామర్, నో యాక్సెసరీస్ ను ఎంచుకుంటూ మీ లుక్ కి ప్రత్యేకతను ఇవ్వండి.

**ఖుషీ కపూర్ పెర్లీ బేబీ లుక్**

జాన్వీ కపూర్ ముద్దుల చెల్లెలు ఖుషీ కపూర్. ఈమె మెరిసే ముత్యాల దుస్తులతో కొత్తగా ఉంది. మీ న్యూ ఇయర్ ఈవ్ ఇలాంటి డ్రెస్ వేస్తే అదిరిపోవడం ఖాయం. స్టైలిష్ బ్యాక్ లెస్ డీటెయిల్స్, బాడీ హగ్గింగ్ సిల్హౌట్, మినీ హేమ్ లెంగ్త్, పెర్ల్ టాసెల్ అలంకరణలతో హాల్టర్‌నెక్ డ్రెస్ అందరి కళ్లను కట్టిపడేస్తాయి. స్టిలెటో స్, మినిమమ్ మేకప్, టాప్ నాట్ తో చిక్ దుస్తులకు కొంత గ్లామర్ జోడించండి.






# 2025 లక్కీ ఇయర్..

వచ్చే ఏడాది ఆడియన్స్‌కి డబుల్ ట్రీట్ ఇవ్వనున్నది అందాలభామ నిధి అగర్వాల్. ఒకే ఏడాది ఇద్దరు సూపర్‌స్టార్లతో రెండు పానిండియా సినిమాల్లో ఆమె మెరవనున్నది. అందులో ఓ సినిమా పవన్‌కల్యాణ్ 'హరిహర వీరమల్లు' కాగా, రెండో సినిమా ప్రభాస్ 'రాజా సాబ్'. ఈ సందర్భంగా ఆమె ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. 'పవన్ సార్‌తో 'హరిహర వీరమల్లు'లో నటించడం చాలా ఆనందంగా ఉంది. అసలు ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం గర్వకారణం కూడా. ఇక 'రాజా సాబ్'లో ప్రభాస్ సార్‌తో కలిసి నటించడం మరిపోలేని అనుభూతి. సినిమాకోసం టీమ్ మొత్తం డెడికేటెడ్‌గా పనిచేస్తున్నారు. ఈ రెండు పాన్‌ఇండియా సినిమాలూ 2025లోనే విడుదల కానున్నాయి. అందుకే 2025 నా లక్కీ ఇయర్. వీటితో పాటు వచ్చే ఏడాది తెలుగు, తమిళంలో మరికొన్ని సర్‌ప్రైజింగ్ మూవీస్‌లో నటిస్తున్నాను. వాటి గురించి త్వరలో తెలియజేస్తా.' అన్నారు నిధి అగర్వాల్.



# చెంచుల యువరాణిగా ప్రీతి ముకుందన్..

ఒకవైపు ఫ్యామిలీ గొడవలతో సతమవుతున్న మంచు ఫ్యామిలీ.. మరోవైపు తమ కలల ప్రాజెక్ట్ కన్నప్పను పూర్తి చేసే పనిలో పడింది. మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు.
హిస్టారికల్ కం మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు పలువురు అగ్ర కథానాయకుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న ప్రీతి ముకుందన్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో ప్రీతి కన్నప్ప ఇష్టసఖి, చెంచుల యువరాణి నెమలి పాత్రలో నటిస్తుంది. "అందంలో సహజం.. తెగింపులో సాహసం.. ప్రేమలో అసాధారణం.. భక్తిలో పారవశ్యం.. కన్నప్పకి సర్వస్వం చెంచుల యువరాణి నెమలి అంటూ" ప్రీతి ముకుందన్ ఫస్ట్‌లుక్‌ను పంచుకుంది.



# ఇట్స్ ఏ బ్లాక్‌బస్టర్ పొంగల్..

## ప్రచారంలో దూసుకుపోతున్న సంక్రాంతికి వస్తున్నాం

వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాపై అంచనాలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే విడుదలైన రెండు పాటలూ జనబాహుళ్యంలో బాగా వినిపిస్తున్నాయి. వందశాతం సక్సెస్‌రేట్ ఉన్న దర్శకుడు అనిల్ రావిపూడి నుంచి మరో బ్లాక్‌బస్టర్ పక్కా అని సినీ అభిమానులు ఫిక్స్ అయిపోయారు. ప్రచారంలో కూడా సినిమా దూసుకుపోతున్నది. సోమవారం గాయని రోహిణి సోరబ్, భీమ్స్ సిసిరోలియోలతో కలిసి హీరో వెంకటేశ్ స్వయంగా ఆలపించిన పండుగ ప్రత్యేక గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. 'గొబ్బియల్లో గొబ్బియల్లో.. పండగొచ్చే గొబ్బియల్లో.. ఎవ్రీబడీ గొబ్బియల్లో.. సింగ్ దిజ్ మెలొడీ గొబ్బియల్లో.. పెద్ద పండగండి గొబ్బియల్లో.. లెట్స్ గెట్ ట్రెండీ గొబ్బియల్లో.. కమాన్.. బేసికల్లీ.. టెక్నికల్లీ.. లాజికల్లీ.. ప్రాక్టికల్లీ.. అండ్ ఫైనల్లీ.. ఇట్స్ ఏ యాటిట్యూడ్ పొంగలూ.. ఇట్స్ ఏ బ్లాక్‌బస్టర్ పొంగలూ..' అంటూ ట్రెండీగా రామజోగయ్యశాస్త్రి రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరిచారు. వెంకటేశ్, ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరిలపై సంక్రాంతి సంబరాల నేపథ్యంలో తెరకెక్కించిన ఈ పాట సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఉపేంద్ర లిమాయే, సాయికుమార్, నరేశ్, వీటీ గణేశ్, మురళీధర్‌గౌడ్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, నిర్మాత: శిరీశ్, సమర్పణ: దిల్‌రాజు, నిర్మాణం: శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com